J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12






THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 49 8.5.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి


SRI CITY
An Integrated Business City

ధన్యవాదాలు



శ్రీసిటీలో క్యారియర్ సంస్థ రూ. 1,000 కోట్ల పెట్టుబడితో నిర్మించనున్న తయారీ కేంద్రానికి జరిగిన
శంకుస్థాపన కార్యక్రమానికి స్వయంగా విచ్చేసి, అభినందనలు తెలిపిన
గౌరవ మానవ వనరుల అభివృద్ధి, ఐటి,
ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖామాత్యులు

**శ్రీ నారా లోకేష్ గారికి**

మా హృదయపూర్వక కృతజ్ఞతలు!












• 31 దేశాలకు చెందిన 250 పరిశ్రమలు • 70 వేల మందికి ఉపాధి (50 శాతం మహిళలు)
• 10 ఏసీ కంపెనీలు, 31 సప్లై కంపెనీలు • 'కూల్ సిటీ'గా ఆవిర్భావం

**శ్రీసిటీ ప్రపంచ తయారీ కేంద్రం! దార్శనికతను సాకారం చేసే ప్రాంగణం!**

## జొన్నవాడ కామాక్షితాయి అమ్మవారికి..

# ప్రముఖ శైవక్షేత్రాల నుంచి 'సారె'!

- **దేవాదాయశాఖ నుంచి తొలిసారిగా ప్రత్యేక ఉత్తర్వులు**



నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడలో వెలసివున్న ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఈసారి తొలిసారిగా అమ్మవారికి రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల నుంచి సంప్రదాయ బద్ధంగా ఎంతో భక్తిశ్రద్ధలతో సగౌరవంగా 'సారె' సమర్పించనున్నారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవస్థానాల మధ్య ఆధ్యాత్మిక అనుబంధాన్ని పెంపొందించే ఉద్దేశ్యంతో దేవాదాయశాఖ ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపడుతుండడం విశేషం. దీంతో జొన్నవాడ దేవాలయానికి కూడా మరింత విశిష్టత చేకూరనుంది. మే 14వ తేదీ రాత్రి వెండి నందిసేవకి శ్రీశైలం నుండి కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి సారెను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అదేవిధంగా, మే 15వ తేదీ ఉదయం జరిగే రథోత్సవానికి శ్రీకాళహస్తి నుండి, 16న ఉదయం జరిగే కల్యాణోత్సవానికి విజయవాడలోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానం నుండి అధికారికంగా సారె సమర్పణోత్సవాలు కనువిందుగా జరుగనున్నాయి. కోవూరు శాసన సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విన్నపం మేరకు, రాష్ట్ర దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ఆమేరకు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు.

## 15న రథోత్సవం..16న కళ్యాణం

జొన్నవాడ బ్రహ్మోత్సవాలకు ఈనెల 7వ తేదీ రాత్రి 8 గంటలకు అంకురార్పణ జరిగింది. 8వ తేదీ ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ కార్యక్రమం నయనానందకరంగా జరుగనుంది. 9వ తేదీ శుక్రవారం రాత్రి నుంచి వైభవంగా వాహనసేవలు ప్రారంభమవుతాయి. 9వ తేదీ రాత్రి శేషవాహనోత్సవం, 10న పురుషామృగవాహనం, 11న సింహ వాహనసేవ, 12న హంసవాహనం, 13న రావణసేవ, 14న వెండినందిసేవ ఉత్సవాలు నిర్వహిస్తారు. 15వ తేదీ ఉదయం 8.30 గంటల నుంచి నేత్రపర్వంగా రథోత్సవం, అనంతరం రాత్రి 8గంటలకి గజ సింహ వాహనసేవలు ఉంటాయి. 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి స్వామివారికి-అమ్మవారికి కన్నుల పండువగా కళ్యాణోత్సవం జరుగుతుంది. ఆ తర్వాత రాత్రి 7 గంటలకు తెప్పోత్సవం, 17న రాత్రి 8 గంటలకు అశ్వవాహనసేవ, అనంతరం రాత్రి 10 గంటలకు ఏకాంత సేవతో ఈ ఉత్సవాలు పూర్తవుతాయి. జొన్నవాడ బ్రహ్మోత్సవాలకు జిల్లా నుంచే కాక రాష్ట్ర రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా భక్తజనం వెల్లువలా తరలివస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు



చైర్మెన్ అశోక్‌రెడ్డి



ఇ.ఓ శ్రీనివాసులురెడ్డి

లేకుండా, ఆలయ చైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వాహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు సంయుక్తంగా అమ్మవారి బ్రహ్మోత్సవాలను దిగ్విజయం చేసేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయడంతో బ్రహ్మోత్సవాల ప్రారంభం నుంచి ఆలయం భక్తజనసందోహంతో కళకళలాడుతోంది.

## నూరేళ్ళ నాటి నందివాహనం



జొన్నవాడ దేవాలయానికి నూరేళ్ళ క్రితం 6-6-1926న నెల్లూరు నగరం నవాబుపేట వాస్తవ్యులు.. దాత ఓలేటి చెంచురామయ్య శ్రేష్ఠి కైంకర్యంగా జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారి దేవస్థానానికి సమర్పించిన వెండి నందివాహనం నూరు వసంతాలు పూర్తిచేసుకుంది. నూరేళ్ళ నాటి 40 కేజీల ఈ వెండి నంది వాహనం జొన్నవాడలో జరిగే నందివాహనోత్సవాల్లో ఎంతో విశిష్టంగా ఉంటుంది. అపూర్వ ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్న ఈ వెండి నంది వాహనోత్సవం భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచి, స్వామి-అమ్మవారి సేవలో తరించింది. పురాతన శిల్పకళా నైపుణ్యం, సంప్రదాయ వారసత్వం కలగలిసిన ఈ వాహనం, నేటికీ దృఢంగా నిలిచి ఉండటం విశేషం. దేవస్థానం వారు ఈ వాహనాన్ని సంరక్షిస్తున్నారు. ఇప్పుడు జరుగుతున్న కామాక్షితాయి అమ్మవారి బ్రహ్మోత్సవాలలో ఈనెల 14వతేదీ గురువారం ఉదయం 8 గంటలకు ఈ శతాబ్ది వెండి నంది వాహనం మీదనే స్వామివారు- అమ్మవార్ల ఊరేగింపు ఉంటుంది. ఈసారి ఇదొక ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. బ్రహ్మోత్సవాలలో వెండి నంది వాహన సేవ సందర్భంగా 101వ సారి శ్రీ స్వామి-అమ్మవారు ఈ వెండి నంది వాహనంపై విహరించనుండడం విశేషం.

## శంకరాచార్యుల సంస్మరణలో.. తరించిన భక్తులు





ప్రవచనకర్త డా. గిరిజాలక్ష్మిని సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు పొగతోటలోని చక్రాల వారి ట్రస్ట్ భవనంలో నిర్మించిన ఆది శంకర ధ్యాన మందిరంలో ఈనెల ఏప్రిల్ 26 నుంచి మే 2వ తేదీ వరకు జగద్గురు శ్రీ ఆదిశంకరాచార్యుల వారి సంస్మరణ పంచమ సప్తాహం ఎంతో వైభవంగా జరిగింది. భక్తులందరూ శ్రీ శంకరాచార్యులవారి సంస్మరణలో తరించారు. ఏప్రిల్ 26 వైశాఖ శుద్ధ దశమి శంకరాచార్యుల వారు పూరి పట్టణంలో "గోవర్ధన పీఠ స్థాపన"; 27వ తేదీ వైశాఖ శుద్ధ ఏకాదశిన శంకరాచార్యులవారి "అవతార సమాప్తి"; 30వ తేదీ వైశాఖ శుద్ధ చతుర్దశి "నృసింహ జయంతి"; మే నెల ఒకటవ తేదీ వైశాఖ పౌర్ణమినాడు "కంచి కామకోటి పీఠ స్థాపన"; 2వ తేదీ వైశాఖ బహుళ పాడ్యమి "పరమాచార్య శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి వారి జయంతి'లను పురస్కరించుకుని ఈ వారోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏప్రిల్ 27, 28, 29 తేదీలలో నెల్లూరు వేద సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధానాధ్యాపకురాలు డాక్టర్ గిరిజాలక్ష్మి భగవద్గీత ప్రవచనాలు అందరినీ ఆకట్టు కున్నాయి. 30వ తేదీ కావూరి హేమలక్ష్మి శిష్య బృందంలోని 15మంది గానాలాపనలతో, వీణానాదార్చనలతో మందిర ప్రాంగణం మార్మోగింది. చక్రాల వారి ట్రస్టు ఆదిశంకర ధ్యాన మందిర కమిటీ నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక ఉత్సవాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అతిథులను, ప్రవచకులను ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, మేనేజర్ చక్రాల వెంకట లక్ష్మీనరసింహం, కమిటీ అధ్యక్షులు గుండాపంతుల రామసుబ్రహ్మణ్య శర్మ, స్వామీ సమయానందనాథ తదితరులు సత్కరించారు. ఈ సందర్భంగా దాతలను అభినందించారు.

# 'చింతలదేవి' అభివృద్ధికి యాక్షన్‌ప్లాన్

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



చింతలదేవి అభివృద్ధి గురించి సమీక్షిస్తున్న మంత్రి ఆనం, ఎమ్మెల్యే డి.వి.కృష్ణారెడ్డి

నెల్లూరుజిల్లా కొండాపురం మండలంలోని చింతలదేవి జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్ అభివృద్ధికి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని రాష్ట్ర దేవాదాయమంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచించారు. ఇటీవల ఆయన కావలిలో చింతలదేవి జాతీయ కామధేను పశుగణాభివృద్ధి సంస్థ అభివృద్ధిపై కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, పశు సంవర్ధక శాఖ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. చింతలదేవి పశుగణాభివృద్ధి కేంద్రాన్ని జాతీయస్థాయిలో ఆదర్శ క్షేత్రంగా తయారుచేయాలన్నారు. 2500 ఎకరాల్లో ఉన్న ఈ క్షేత్రాన్ని అద్భుతంగా అభివృద్ధిచేసి మేలు జాతి పశుసంపదను ఉత్పత్తిచేసి పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. బ్రీడింగ్ సెంటర్‌కు నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు.

# రికార్డు స్థాయిలో 'ఉద్యమి' సభ్యత్వాలు

### జిల్లా జనసేన నాయకులకు నాగబాబు ప్రశంస



జనసేన నాయకులు వేములపాటి అజయ్‌కుమార్, గునుకుల కిషోర్‌లను అభినందిస్తున్న నాగబాబు

రికార్డు స్థాయిలో 'ఉద్యమి' సభ్యత్వాలు జిల్లాలో 72వేలు దాటడం పట్ల నెల్లూరు జిల్లా జనసేన సాధకులను జనసేన నాయకుడు, ఎమ్మెల్సీ నాగబాబు అభినందించారు. జనసేన నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సేవలను ప్రశంసించారు. ఇటీవల హైదరాబాద్ మాదాపూర్‌లో జరిగిన సమావేశంలో నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ సభ్యత్వాలను రికార్డు స్థాయిలో విస్తరించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఏపీ టిడ్కో చైర్మెన్ అజయకుమార్ పర్యవేక్షణలో జరుగుతున్న ఉద్యమి సభ్యత్వ నమోదుల పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తం చేశారు. ఏపీ టిడ్కో చైర్మెన్ వేములపాటి అజయ్, జిల్లా నాయకులు గునుకుల కిషోర్, శివక్రిష్ణ, ప్రశాంత్‌గౌడ్, వేముల శివకృష్ణ, చిత్తూరు బాలాజీ, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## 'పెరుగు'కి అరుదైన గౌరవం



నెల్లూరుకి చెందిన ప్రముఖ కవి పెరుగు రామకృష్ణకి రోమ్ దేశం నుండి అరుదైన గౌరవం లభించింది. ఆయన ప్రతిభావంతమైన సాహిత్య కృషికి ఇంటర్నేషనల్ అకాడమీ ఆఫ్ రోమ్ వారు 'హానరరీ అకాడమిషియన్' అనే గౌరవ పురస్కారంతో సత్కరించి ఆన్‌లైన్‌లో ఆమేరకు ఆయనకు ఈ నెల 7న సమాచారం పంపారు. స్థానిక కవులు ఆయనని అభినందించారు.

## ఆత్రేయ సాహిత్యం మరువలేనిది



ప్రొ. విస్తాలి శంకరరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

మనసు కవి ఆచార్య ఆత్రేయ సాహిత్యం, ఆయన సినీ గీతాలు ఏనాటికీ మరువలేనివని చెన్నైలోని మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షులు.. ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ ప్రొ. విస్తాలి శంకరరావు అన్నారు. ఈనెల 6న నెల్లూరులోని టౌన్‌హాల్ వర్ధమాన సమాజంలో చేతన సంస్థ నిర్వహించిన సాహిత్య కార్యక్రమంలో 'జీవనవేదం-ఆత్రేయ సినీ సాహిత్యం' అనే అంశంపై ఆయన ప్రసంగించి, ఆత్రేయ రచనల గొప్పతనాన్ని వివరించారు. అనంతరం, చెన్నై లోని వేద విజ్ఞాన వేదిక కార్యదర్శి కందనూరు మధు, సినీ రచయిత డా.పి.రాజేంద్రకుమార్, చేతన నిర్వాహకులు వై.శేషగిరీశం, డా. ఎం.సుబ్రహ్మణ్యం, ప్రపంచ తెలుగు సమాఖ్య రీజనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడుతో పాటు పలువురు సాహిత్యాభిమానులు పాల్గొని శంకరరావును సన్మానించారు.

J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 45 సంచిక : 49 8.5.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## బెంగాల్ తమిళనాడు ఓటర్ల తీర్పు.. రాజకీయాలలో కొత్త మలుపు

మొన్న జరిగిన 5 రాష్ట్రాల ఎన్నికలలో పశ్చిమ బెంగాల్ ఓటర్లు మమతే లేని మమతని ఓడగొట్టి పెట్టి పక్కన పెట్టారు. తమిళనాడులో ఈల మోతకు ఉదయ సూర్యుడు(డిఎంకె) ఉదయించకుండానే అస్తమించాడు. పచ్చటి రెండాకులు (ఏఐఏడిఎంకె) ఎండుటాకులుగా మారిపోయాయి. బెంగాలీయులు కమలానికి కాపుకాస్తే, తమిళ తంబీలు ద్రవిడ పార్టీల దవడ పగలగొట్టి నవశకానికి నాంది పలికారు.

## సమ్మోహన శక్తి మోడీ



- బెంగాల్ విజయంతో పతాక స్థాయికి చేరిన 'నమో' కీర్తి
- దేశంలో 21 రాష్ట్రాలు కాషాయమయమే

స్వతంత్ర భారత చరిత్రలో ఏ ప్రధానికి లేని చరిష్మా, ఇతర ఏ ప్రధానికి లేని అభిమాన గణాన్ని సంపాదించుకున్న దిగ్గజ నేత మన నరేంద్ర ప్రధాని మోడి. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. తాజాగా ఆయన బెంగాల్‌లో మమతా బెనర్జీని మట్టికరిపించి మరోసారి తన మాయాజాలాన్ని ప్రదర్శించారు. 11లో

## విజయ్ విజయ దుందుభి.. నవశకానికి నాంది



- పాతుకుపోయిన ద్రవిడ పార్టీలకి షాక్
- కాంగ్రెస్ మద్దతు కోరి చిక్కుల్లోపడ్డ టీవీకే
- ఆదిలోనే హంసపాదు

ఇళయ దళపతి విజయ్ తమిళనాట చరిత్ర సృష్టించారు. పోటీ చేసిన తొలి ఎన్నికల్లోనే 108 స్థానాలతో సత్తా చాటారు. అన్నాదురై కాలం నుంచి కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత వంటి రాజకీయ ఉద్దండులను చూసిన ద్రవిడ పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకే విజయ్ దెబ్బకు తునాతునకలయ్యాయి. దీంతో విజయ్ విజయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 11లో

## ఏసీల తయారీలో మేటి.. శ్రీసిటీ



- వెయ్యి కోట్ల పెట్టుబడితో.. 'క్యారియర్' వచ్చేసింది
- శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్
- మరో రెండేళ్ళలో దేశంలో 80 శాతం ఏసీలు ఏపీ నుంచే తయారీ
- 3000 మందికి ఉపాధి 12లో



## సంస్మరణ

నాయకులకే నాయకుడు
ఎందరికో మార్గదర్శకుడు
దీనజన బాంధవుడు
జన నేత... మన జనార్ధనుడు

అభివృద్ధి ప్రదాత.. మాజీ ముఖ్యమంత్రి
**డా॥ నేదురుమల్లి జనార్ధనరెడ్డి గారు**
స్వర్గస్తులై తేది.09.05.2026 నాటికి
12 ఏళ్ళు గడవనున్న సందర్భంగా
వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ...

నేదురుమల్లి కుటుంబ సభ్యులు
బంధుమిత్రులు
మరియు అభిమానులు

లాయర్
మే 08, 2026

# ప్రభుత్వ పాఠశాలల ప్రభంజనం!

ఎట్టకేలకి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలు తమ సత్తా చాటుకుంటున్నాయి. కార్పొరేట్ స్కూళ్లకి దిమ్మతిరిగేలా ప్రభుత్వ స్కూళ్లు పదవ తరగతి ఫలితాల్లో ముందంజలో నిలుస్తుండడం విశేషం. ఒకప్పుడు ప్రభుత్వ బడులంటేనే, అవి అసౌకర్యాలకి నిలయాలని, అక్కడ చదువులు సరిగా చెప్పే వారు ఉండరని, ప్రయివేట్ స్కూళ్లలో తమ పిల్లలను చేర్పించడమే నయమని అధికశాతం మంది తల్లితండ్రులు భావించేవారు. అదే అదనుగా, వారి బలహీనతను ఆసరాగా చేసుకుని, ఆ స్కూళ్ల నిర్వాహకులు అధికఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తూ, తల్లితండ్రులని నిలువుదోపిడి చేసేవారు. అందుకు తగ్గట్టుగా, గత ప్రభుత్వంలో విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం కావడం, ఉన్నతమైన.. చరిత్రాత్మకమైన విద్యాలయాలకే మంగళం పాడడం, పాఠశాల విద్యావ్యవస్థ అంతా అవస్తల మయంగా మారడం తెలిసిందే. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రాకతో, విద్యారంగం మునుపటి కళ సంతరించుకుని, ఇంతకాలంగా ఉన్న అనేక సమస్యలను అధిగమిస్తూ, ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు ముందంజ వేస్తుండడం హర్షదాయకం. అందులోనూ మొన్నటి పదవ తరగతి పరీక్షల్లోనైతే, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారు. ప్రభుత్వ బడుల విద్యార్థుల ప్రభంజనం చూసి కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల వారే కాక, సామాన్య ప్రజానీకం కూడా ఆశ్చర్యపోతున్నారంటే అతిశయోక్తి కాదు. నాణ్యమైన విద్యకి కార్పొరేట్ విద్యాసంస్థలే నిలయాలని గొప్పలు చెప్పుకుంటున్న వారంతా, ప్రభుత్వ బడుల్లోని ఉత్తీర్ణతల ఉధృతికి తట్టుకోలేకపోతున్నారు. ఎన్నో రకాల ఉత్సాహ ప్రోత్సాహాలనిస్తూ ప్రభుత్వ పాఠశాలలను ప్రభుత్వం ఎంతగానో బలోపేతం చేస్తోందనడంలో ఎలాంటి సందేహం లేదు. మధ్యాహ్న భోజనంతో పాటు, పుస్తకాలు..యూనిఫార్మ్‌లు ఇలా ఎన్నో సౌకర్యాలను ప్రభుత్వం ఉచితంగానే పిల్లలకు అందజేస్తూ వారిలో ఉన్న ప్రతిభకి మెరుగులుపెడుతోంది. ఉపాధ్యాయులు గతంలో కంటే మెరుగ్గా బోధన చేస్తూ, పిల్లలను క్రమశిక్షణతో తీర్చిదిద్దుతున్నారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షించే అధికారులు, వార్డెన్లు మునుపటి కంటే సీరియస్‌గా పిల్లల భవితవ్యం పట్ల శ్రద్ధ చూపుతున్నారు. దీంతో, విద్యార్థులు కూడా చదువుల్లో మెరికల్లా తయారవుతున్నారు. నిరుపేద పిల్లలు సైతం కష్టపడి బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకుని ఆణిముత్యాల్లా అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. మొన్నటి టెన్త్ ఫలితాల్లో ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థుల్లో 600 మార్కులకి గాను 595కి పైగానే మార్కులు సాధించిన వారు 13 మంది ఉండడం, 590కి పైగా మార్కులు తెచ్చుకున్న వారు 200 మంది ఉండడం ప్రాథమిక విద్యారంగంలోనే అపూర్వం. ఇంత ప్రతిభావంతంగా చదువుకుంటున్న ప్రభుత్వ బడుల విద్యార్థులను ఆయా జిల్లాల్లో కలెక్టర్లు కూడా అభినందిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో చదువు చెప్పే అయ్యావార్లు కూడా ఈసారి తమ విద్యార్థుల ఉత్తీర్ణతలను సగర్వంగా అందరికీ వివరిస్తున్నారు. పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులంతా కలసి ఆయా ప్రాంతాల్లో ర్యాలీలు కూడా నిర్వహించి, మేం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నాం.. మంచి మార్కులు తెచ్చుకుంటున్నాం' అంటూ నినాదాలు చేస్తూ, ప్రభుత్వ బడులపై గతంలో ఉన్న అపోహలను తొలగిస్తున్నారు కూడా. అంతేకాదు, కొన్ని ఊళ్ళలో అయ్యావార్లు కూడా ఇంటింటికీ వెళ్ళి 'చూశారా ప్రభుత్వ బడులంటే ఎంత బాగా చదువులు చెప్తున్నాయో.. మీరూ మీ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి. అనవసర ఫీజులు, లేనిపోని డొనేషన్లు ఏమీ ఉండవు'.. అంటూ ఇంటింటికీ వెళ్ళి అందరికీ చెప్తున్నారంటే, ప్రభుత్వ విద్యారంగంలో జరుగుతున్న మంచి మార్పులకి ఇదో పెద్ద సంకేతమనే చెప్పవచ్చు. దీంతో కార్పొరేట్ స్కూళ్ళ కంటే గవర్నమెంట్ స్కూళ్ళకే డిమాండ్ బాగా పెరిగిపోతోంది. నిజంగానే ఇదొక అద్భుతం!..

అయితే, అంతమాత్రాన్నే అంతా సాధించినట్లు కాదు. ఇప్పటి ఫలితాలను స్ఫూర్తిగా తీసుకుని, వచ్చే ఏడాది ఇంత కంటే ఎక్కువగా విద్యార్థులు తమ ఉత్తీర్ణతల్లో మరిన్ని విజయాలు సాధించాలి. ప్రభుత్వ బడుల ప్రతిష్టని శిఖరాయమానం చేయాలి. ప్రభుత్వంతో పాటు తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యపై మరింత శ్రద్ధ చూపిస్తే..ఒక్క టెన్త్‌లోనే కాదు..ఎంతటి ఉన్నత విద్యలోనైనా మనకిక తిరుగుండదు. ప్రాథమిక స్థాయిలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అధునాతన సాంకేతిక విద్య పట్ల కూడా విద్యార్థులకు అవగాహన కలిగించే దిశగా సిలబస్‌ని మార్చుకోవాలి. ఆ దిశలో వెంటనే గట్టి ప్రణాళికలు, ప్రయత్నాలు ప్రారంభించాలి. తద్వారా విద్యార్థుల బంగారు భవితకి ఇప్పటినుంచే ప్రభుత్వాలు బాటలు వేయాలి!...

# జగన్‌రెడ్డిని మరిపిస్తున్న డోనాల్డ్ ట్రంప్!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

తుగ్లక్ తరహా నిర్ణయాలు తీసుకోవడంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైసీపీ అధినేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరిపిస్తున్నాడు. 2019-24 మధ్య కాలంలో అయిదేళ్లపాటు ఆంధ్రాని పరిపాలించిన జగన్‌మోహన్‌రెడ్డి తన అపరిపక్వ నిర్ణయాలతో రాష్ట్రాన్ని ఏ గతిపట్టించాడో అందరికీ తెలిసిందే. అవగాహనా రాహిత్యంతో, సలహాదారుల ఆధిపత్యంతో జగన్ అప్రతిష్టపాలయ్యాడు. ఫలితంగా 2024లో జనం 11 సీట్లిచ్చి సరిపెట్టారు. జగన్ చేసిన అనేక తప్పిదాలతో రైతులకి ఇచ్చే పట్టాదారు పాసుపుస్తకంపై ఆయన ఫోటో వేసుకోవడం ఒకటి. అంతేకాకుండా సర్వే రాళ్ళపైన కూడా ఆయన ముఖారవిందం వుండాలని కోరుకోవడం మరో తప్పిదం. ఇప్పుడు అగ్రదేశపు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా అన్నీ తలతిక్క నిర్ణయాలే తీసుకుంటూ జగన్‌రెడ్డిని అనుసరిస్తున్నాడు. ఇరాన్‌తో ట్రంప్ మొదలుపెట్టిన యుద్ధం ప్రభావంతో ప్రపంచ దేశాలన్నీ ఏదో ఒక రకంగా ఇబ్బందులు పడుతున్నాయి. ముఖ్యంగా అమెరికా దేశ ప్రజలే ఈ యుద్ధం వల్ల ఎక్కువగా కష్టాలని ఎదుర్కొంటూ ట్రంప్‌పై తిరుగుబాటు కూడా చేశారు. ఇదే తరుణంలో తాజాగా ట్రంప్ మరో మూర్ఖపు నిర్ణయం కూడా తీసుకున్నారు. ఇకపై అమెరికా దేశంలో జారీచేసే ప్రతీ పాస్‌పోర్టుపైన తన ఫోటో ముద్రించాలని శాసనం చేశాడు. ఈ ఏడాది జూన్ ఒకటవ తేదీ నుండి తన ఆదేశాలని అమలులో పెట్టాలని హుకుం జారీ చేశాడు. జగన్‌రెడ్డి రైతు పాసు బుక్కులపైన తన ఫోటో వేసుకుంటే, ట్రంప్ ఏకంగా తమ దేశ ప్రజలందరి పాస్‌పోర్టు పైన తన ఛాయాచిత్రం వుండాలని నిర్ణయం తీసుకున్నాడు. జగన్‌మోహన్‌రెడ్డి సృష్టించిన విధ్వంసం నుండి రాష్ట్రం కోలుకోవడానికి ఇరవై ఏళ్ళు పడుతుందంటున్నారు. మరి ట్రంప్ చేస్తున్న కంపుకి ఆ దేశం కోలుకోవడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందో..? పాపం అమెరికన్లు...!

డాక్టర్. ఎస్. అనూష, బెంగళూరు.

# ఈ ఫలితాలు దేనికి సంకేతం!

మొన్న జరిగిన అయిదు రాష్ట్రాల ఎన్నికలలో ఓటర్లు సంచలనాత్మకమైన తీర్పు ఇచ్చారు. అహంకార పూరిత నేతలు, అవినీతి నాయకులు అధికారంలో వుండడానికి అనర్హులు అన్నట్లుగా అటు వెస్ట్‌బెంగాల్‌లోనూ ఇటు తమిళనాడులోనూ ప్రజలు తమ నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పారు. ఇక నాయకులు అన్ని విధాల సమర్ధులై వారి పరిపాలన ప్రజామోదయోగ్యంగా ఉంటే జనం తప్పక ఆదరిస్తారనే సందేశం ఇచ్చేలా ఒరిస్సా, పుదుచ్చేరి ఓటర్లు పాత పాలకులనే ఆదరించారు. అధికశాతం విద్యావంతులైన ఓటర్లు వున్న కేరళలో ముందు నుండి అనుకున్నట్లుగానే కాంగ్రెస్‌కి పట్టం కట్టారు. తమిళనాడు, కేరళ మినహా మిగిలిన మూడుచోట్లా కమలనాథులున్న ఎన్డీయేకే జనం జైకొట్టారు. ఇప్పటికే దేశంలోని చాలా రాష్ట్రాలలో అధికారంలో వున్న బీజేపీకి బెంగాల్‌లో తమ జెండా ఎగురవేయడం అతిపెద్ద విజయం. అక్కడ కాషాయజెండా ఎగరాలని, మమత అరాచక పర్వానికి అడ్డుకట్ట పడాలని దేశంలో వున్న హిందూ సమాజం మొత్తం ప్రార్ధనలు చేసింది. బెంగాల్ ఓటర్లు సైతం తమది కూడా అదే కోరిక అన్నట్లుగా తీర్పు చెప్పారు. గతంలోలా కాకుండా నేటి ఓటర్లు చాలా నేర్పుగా, చాలా తెలివిగా విజ్ఞతతో అలోచించి తమ నేతలని ఎన్నుకుంటున్నారనడానికి సంకేతమే ఈ ఫలితాలు. కేవలం నోట్ల కట్టలు కుమ్మరించి ఓట్ల పెట్టెలు నింపుకోవాలని చూసేవారికి ఈ ఫలితాలు గట్టి హెచ్చరిక లాంటివే అనడానికి సందేహమే అవసరంలేదు.!

– యం. చంద్రమౌళి, కొత్తఢిల్లీ.

# రాజకీయ ఆత్మహత్యలు

మనసులో మాట 96

రాజకీయాల్లో తరచుగా వినిపించే ఒక లోతైన వాక్యం.. "రాజకీయాల్లో హత్యలుండవు, ఆత్మహత్యలే ఉంటాయి." అంటే, ఒక రాజకీయ పార్టీని లేదా నాయకుడిని ప్రత్యర్థులు అంతం చేయడం కంటే, సదరు పార్టీ తన స్వయంకృత అపరాధాల వల్లే పతనం కావడం ఎక్కువ అని దీని అర్థం. 2026 నాటి తాజా ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే, ఈ మాట అక్షర సత్యమనిపిస్తుంది. ముఖ్యంగా గతంలో పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారిని మమతా బెనర్జీ దూరం చేసుకోవడం, అస్సాంలో హిమంత బిశ్వ శర్మను కాంగ్రెస్ నిర్లక్ష్యం చేయడం వంటి పరిణామాలు ఇప్పుడు ఆయా పార్టీల భవిష్యత్తును ఎలా తలకిందులు చేశాయో ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనం.

## పునాదులు కదిలించిన 'అహం'

రాజకీయాల్లో ప్రత్యర్థి విసిరే బాణాల కంటే, పక్కనే ఉండి వెళ్ళిపోయిన ఆత్మీయుడు ఎక్కుపెట్టిన అస్త్రాలే ఎక్కువ ప్రాణసంకటంగా మారుతాయి. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సువేందు అధికారి పాత్ర సరిగ్గా ఇదే రకమైనది. తృణమూల్ కాంగ్రెస్ జైత్రయాత్రకు సువేందు అధికారి ఒక బలమైన పునాది. నందిగ్రామ్ ఉద్యమంలో మమతా బెనర్జీ పక్కన నిలబడి, వామపక్షాల కోటను కూల్చిన సేనాని ఆయన. అయితే, పార్టీలో వారసత్వ రాజకీయాల ప్రాధాన్యం పెరగడం, అభిషేక్ బెనర్జీకి మితిమీరిన ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల సువేందు మమత పార్టీకి దూరం కావాల్సి వచ్చింది. మమత తన చరిష్మా మీద ఉన్న నమ్మకంతో సువేందు వంటి క్షేత్రస్థాయి నాయకుడిని తక్కువ అంచనా వేశారు. నన్ను చూసి ఓటు వేయండి అని ప్రజలకు ఎంత విన్నవించినా వారు మార్పును కోరుకున్నారు. ఈ మార్పును వేగంగా తీసుకురావడంలో సువేందు అధికారి కీలక పాత్ర పోషించారు. ఆయన కేవలం ఒక సాధారణ నాయకుడిగా బీజేపీలోకి వెళ్ళలేదు; తృణమూల్ కాంగ్రెస్ అంతర్గత రహస్యాలు, ఆ పార్టీ ఎన్నికల నిర్వహణ వ్యూహాలు మరియు మమతా బెనర్జీ బలహీనతలను క్షుణ్ణంగా తెలిసిన ఒక 'ఇన్‌సైడర్'గా ప్రత్యర్థి శిబిరంలో చేరారు.

సువేందు కేవలం మమతను వ్యక్తిగతంగానే కాకుండా, క్షేత్రస్థాయిలో ఆమెకున్న సామాజిక పునాదులను కూడా తెలివిగా దెబ్బతీశారు. దశాబ్దాల పాటు టీఎంసీలో పనిచేసిన అనుభవంతో, ఏయే సామాజిక వర్గాలు పార్టీపై అసంతృప్తితో ఉన్నాయో ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంది. ముఖ్యంగా మతువా వంటి కీలక సామాజిక వర్గాలను బీజేపీ వైపు తిప్పడంలోనూ, మమత కేవలం ఒక వర్గం ఓట్లపైనే ఆధారపడుతోందనే ముద్ర వేయడంలోనూ ఆయన విజయం సాధించారు. నందిగ్రామ్ ఉద్యమ సమయంలో మమత వెంట నడిచిన పాత కార్యకర్తలను, నాయకులను తనవైపు తిప్పుకోవడం ద్వారా ఆమెను తన సొంత గడ్డపైనే "అపరిచితురాలిగా" చిత్రించగలిగారు. ఇది తృణమూల్ కాంగ్రెస్ నైతిక స్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీసింది.

## కాంగ్రెస్ చేసిన చారిత్రక తప్పిదం

అస్సాం, ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ పతనాన్ని విశ్లేషిస్తే, హిమంత బిశ్వ శర్మ ఉదంతం ఒక పాఠంలా కనిపిస్తుంది. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి వెన్నెముకగా ఉన్న హిమంత, తన విజ్ఞప్తులను అధిష్టానం వినకపోవడం వల్ల 2015లో పార్టీని వీడాల్సి వచ్చింది. రాహుల్‌గాంధీ తనను కలిసేందుకు సమయం ఇవ్వలేదని, తన కంటే తన పెంపుడు కుక్కకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారని హిమంత స్వయంగా ఆరోపించడం కాంగ్రెస్ నాయకత్వ వైఫల్యానికి అద్దం పట్టింది.

హిమంత బీజేపీలోకి వెళ్లిన తర్వాత ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోయింది. నేడు హిమంత బిశ్వ శర్మ అస్సాం ముఖ్యమంత్రిగా ఉండటమే కాకుండా, ఈశాన్య రాష్ట్రాలన్నింటినీ బీజేపీ కూటమిలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు. ఇది కాంగ్రెస్ పార్టీ స్వయంగా చేసుకున్న ఆత్మహత్య వంటిదే. బలమైన ప్రాంతీయ నాయకులను గుర్తించడంలో, వారికి సముచిత స్థానం ఇవ్వడంలో ఢిల్లీ నాయకత్వం వైఫల్యం చెందడం వల్లే నేడు ఆ పార్టీ దేశవ్యాప్తంగా ఉనికి కోసం పోరాడుతోంది.

పై రెండు ఉదాహరణల్లోనూ ఒక సామాన్యమైన అంశం కనిపిస్తుంది. నాయకత్వ అహంకారం. ఒక పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లేదా బలంగా ఉన్నప్పుడు, వ్యక్తిగత ఇమేజ్ కంటే క్షేత్రస్థాయిలో పని చేసే 'ఆర్గనైజర్లు' ఎంత ముఖ్యమో అధినేతలు మర్చిపోతుంటారు. పార్టీలో కష్టపడి పైకి వచ్చిన నాయకుల కంటే, వారసులకు ప్రాధాన్యత ఇవ్వడం సువేందు అధికారి వంటి వారిని అసంతృప్తికి గురిచేసింది. తాజా ఎన్నికల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించింది. పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి తన సామాజిక వర్గాన్ని, మత్స్యకార ఓట్లను బీజేపీ వైపు మళ్లించడంలో సఫలీకృతులయ్యారు. అటు అస్సాంలో హిమంత అభివృద్ధి మరియు హిందూత్వ ఎజెండాను మేళవించి కాంగ్రెస్ ఓటు బ్యాంకును ముక్కలు చేశారు. ఈ నాయకులు తాము ఉన్న పార్టీలను కేవలం గెలిపించడమే కాకుండా, తమ పాత పార్టీల లోపాలను ఎత్తిచూపుతూ వాటిని పతనం చేయడంలో 'ఇన్‌సైడర్' నాలెడ్జ్‌ను అద్భుతంగా వాడుకున్నారు. ప్రత్యర్థులు ఎంత బలంగా ఉన్నా, సొంత గూటిలోని నాయకులు పక్కకు వెళ్లనంత వరకు ఏ పార్టీకైనా ముప్పు తక్కువ. కానీ, ఎప్పుడైతే ఆత్మగౌరవం దెబ్బతింటుందో, సిద్ధాంతాల కంటే వ్యక్తిగత గుర్తింపు ముఖ్యం అనుకుంటారో, అప్పుడు నాయకులు పార్టీని వీడతారు.

సువేందు అధికారి, హిమంత బిశ్వ శర్మలు కేవలం వ్యక్తులు కాదు, వారు వ్యవస్థగా ఎదిగిన వారు. అటువంటి వ్యవస్థలను దూరం చేసుకోవడం అంటే రాజకీయంగా ఆత్మహత్య చేసుకోవడమేనని తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ అనుభవాలు నిరూపించాయి. పార్టీ కంటే ఏ నాయకుడూ ఎక్కువ కాదు కానీ, ఏ నాయకుడూ తక్కువ కాదు అన్న సత్యాన్ని పార్టీలు గుర్తించాల్సి ఉంటుంది. ఓటర్ల మనసును గెలవడం ఎంత ముఖ్యమో పార్టీ లోపలి మనుషులను గెలవడం కూడా అంతే ముఖ్యం అని గమనించుకోవాల్సి ఉంటుంది.



– తుమ్మల బాల గంగాధర్ తిలక్

# సింహపురి గడ్డపై..తొలిసారిగా 'మహానాడు'

- మే 27-28-29 తేదీల్లో..టీడీపీ 'పెద్దపండుగ'
- కొడవలూరు ఇఫ్కో సెజ్‌లో పనులకు శ్రీకారం
- భూమిపూజలో పాల్గొన్న మంత్రులు, నాయకులు

సింహపురి గడ్డపై తొలిసారిగా తెలుగుదేశం పార్టీ మహానాడు' సభలను నిర్వహించబోతోంది. అత్యంత భారీగా జరిగే ఈ సభలను దిగ్విజయం చేసేందుకు జిల్లాకి చెందిన నాయకులు సమాయత్త మయ్యారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత, పార్టీ పెద్దపండుగగా భావించే మహానాడు వేదికకు నెల్లూరుజిల్లా వేదిక కావడంతో తెలుగుతమ్ముళ్ళలో ఉత్సాహం ఉరకలెత్తుతోంది.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన విపిఆర్ దంపతులు, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, పాశిం సునీల్, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అజీజ్, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులు



భూమి పూజ చేస్తున్న జిల్లా టీడీపీ నాయకులు

ఈనెల 27, 28, 29 మూడు రోజుల పాటు జరగనున్న మహానాడు సభలకు, కొడవలూరు మండలం రేగడిచెలిక వద్దనున్న ఇఫ్కో సెజ్ వేదికగా మారింది. ఆ సెజ్ ప్రాంగణంలో మహానాడు వేదిక ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. ఈనెల 6న మహానాడు పనులకు అత్యంత వైభవంగా టీడీపీ నేతల సమక్షంలో భూమిపూజ జరిగింది. రాష్ట్ర మంత్రులు నారాయణ, రామనారాయణరెడ్డి, ఎంపీ వేమిరెడ్డి దంపతులు, జిల్లాకి చెందిన శాసనసభ్యులు, పార్టీ అగ్రనేతలు ఈ భూమిపూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలమంతా ఐక్యంగా పనిచేసి మహానాడును ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే మహానాడు కార్యకర్తలకు ఒక పెద్ద పండుగ లాంటిదన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ ఆదేశాల మేరకు 2200 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఇఫ్కో సెజ్ ప్రాంతాన్ని వేదికగా ఎంపిక చేశామని తెలిపారు. దీనివల్ల లక్షలాదిగా తరలివచ్చే అభిమానులకు పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు ఉండవని అన్నారు మూడు రోజుల సభల్లో రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే ఎన్నో కీలక నిర్ణయాలు తీర్మానాలు చేయబోతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని నాయకులందరినీ సమన్వయ పరుచుకుంటూ సమిష్టి కృషితో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. మహానాడు ఏర్పాట్లకు సంబంధించి నాయకులంతా పలుసార్లు చర్చించుకుని ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. మహానాడు నిర్వహించేందుకు సభా ప్రాంగణం, పార్కింగ్, ట్రాఫిక్, వసతి, భోజన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు.. టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ముఖ్యమంత్రి కార్యక్రమాల కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్, జిల్లాకి చెందిన ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కాకర్ల సురేష్, కురుగొండ్ల రామకృష్ణ, డీవీ కృష్ణారెడ్డి, పాశం సునీల్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులతో పాటు నగర మేయర్ సుజాత, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ డాక్టర్ జెడ్.శివప్రసాద్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డిలతో పాటు పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అందరూ కలసి మహానాడును 'న భూతో న భవిష్యతి' అనే రీతిలో నిర్వహించాలనే సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నారు.

# జిల్లా అభివృద్ధికి అధికారుల కృషి భేష్!

- తిరుపతి ఎకనామిక్ రీజియన్ సీఇఓ ముఖేష్‌కుమార్ మీనా ప్రశంస



సమావేశంలో మాట్లాడుతున్న ముఖేష్‌కుమార్, పక్కన కలెక్టర్ హిమాన్షు

జిల్లా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని పారిశ్రామికంగా, ప్రాధాన్యతా రంగాలలో నెల్లూరు జిల్లా యంత్రాంగం చేస్తున్న కృషిని తిరుపతి ఎకనామిక్ రీజియన్ సిఇఓ ముఖేష్‌కుమార్ మీనా అభినందించారు. ఇటీవల ఆయన జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లతో కలసి, నెల్లూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రెవిన్యూ డివిజినల్ అధికారులు, జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని మూడు ఎకనామిక్ రీజియన్‌లుగా వర్గీకరించారని అవి విశాఖపట్నం, అమరావతి మరియు తిరుపతిగా ఉన్నాయన్నారు. తిరుపతి ఎకనామిక్ రీజియన్‌లో నెల్లూరుతో సహా 9 జిల్లాలు ఉన్నాయన్నారు. ప్రతి రీజియన్‌లో ఓ ఎపెక్స్ కమిటి, స్క్రీనింగ్ కమిటీలు ఉంటాయన్నారు. తొలిసారిగా నెల్లూరులో ఈ సమావేశం నిర్వహించడం జరిగిందని, అన్ని శాఖలు సమన్వయంతో ప్రణాళికలు సిద్దం చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో తగు పరిశీలనలు జరిపి జిల్లా అబివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జిల్లాకు భారీ పరిశ్రమలు రానున్నాయని, అందులో బి.పి.సి.యల్ కంపెనీ సుమారుగా 96 వేల కోట్ల పెట్టుబడితో రానున్నదని, అందుకు భూసేకరణకు అవసరమైన 6 వేల ఎకరాలకు గాను 4,200 ఎకరాలు సేకరించడం జరిగిందని తెలిపారు. అలాగే జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బరును త్వరలో మత్స్యకారులకు అందించేందుకు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా రెవిన్యూ అధికారి విజయ కుమార్, సి.పి.ఓ నరసింహారావు, రెవిన్యూ డివిజినల్ అధికారులు అనూషా, పావని, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఆస్తులను పరిరక్షించాలి

విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ చేస్తే ఆందోళన ఉధృతం చేస్తామంటూ వామపక్ష నాయకులు, ఉద్యోగులు హెచ్చరించారు. ఈనెల 5న ఆర్టీసిలోని నెల్లూరు-2వ డిపో ఎదుట సీపీఎం నాయకులు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. విద్యుత్ బస్సులు రావడం మంచిదేనని, అయితే వాటిని ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడపాలని వారు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపోని ప్రైవేటు పరం చేసే ఆలోచనలకు తాము వ్యతిరేకమని, అదే జరిగితే ఉద్యమం తప్పదని వామపక్ష సంఘాల నాయకులు మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు మోహన్‌రావు, రామరరాజు, వెంకమరాజు, సునీల్, శ్రీరాములు స్పష్టం చేశారు.

ఉత్తరక్రియలు



మమతల మణిదీపం, మా ఇంటి దైవం
శ్రీమతి డేగపూడి బుజ్జమ్మ గారు
తేది: 01-05-2026 నాడు స్వర్గస్తులైనారు.
వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.
కుమారులు :
డాక్టర్ డేగపూడి జనార్ధనరెడ్డి
డేగపూడి శివకుమార్‌రెడ్డి
మరియు కుటుంబసభ్యులు
ఉత్తరక్రియలు: తేది: 13-05-2026 బుధవారం ఉదయం 9 గంటలకు
2సి స్వాతి కోర్టు నార్త్ బ్లాక్, 43 విజయ రాఘవరోడ్డు, టి.నగర్ (ఆంధ్రక్లబ్ ఎదురుగా)
చెన్నై నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## గ్యాస్ ధరలపై మండిపడ్డ సీపీఎం

పెరిగిన వాణిజ్య వంట గ్యాస్ ధరలపై సీపీఎం నేతలు మండి పడ్డారు. ఈనెల 3న నెల్లూరు రూరల్ పరిధిలోని వనంతోపు సెంటర్ నుంచి కొండాయపాళెం గేటు వరకు ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ర్యాలీ నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లపై ధరలు పెరగడంతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, సీపీఎం రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య గ్యాస్ భారీగా పెరగడంతో హోటల్ రంగం కుదేలైపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకుడు కె.పెంచలనరసయ్య, పోతురాజు, శ్రీనివాసులు, నాగేశ్వర్‌రెడ్డి, రఘురామయ్య తదితరులు పాల్గొన్నారు.

### అట్టహాసంగా ఎంజీబీ గ్రూప్...

## 'ఎంజీబీ ఇన్ఫినిటీ కాకుపల్లి-2' విల్లాస్ ప్రాజెక్ట్ వెంచర్

### 70 విల్లాలతో.. అల్ట్రా మోడరన్ గేటెడ్ కమ్యూనిటీ విల్లాస్ ప్రాజెక్టు



వెంచర్ బ్రోచర్‌ని ఆవిష్కరిస్తున్న ఎంజీబీ సంస్థల ఛైర్మన్ ఎం.ఆర్.గంగాధర్, ఎంజీ గోపాలకృష్ణ, ఎంజీ రాఘవేంద్ర, ల్యాండ్ ఓనర్స్ సిద్ధారెడ్డి రంగారెడ్డి, శ్రీమతి కవితారెడ్డి తదితరులు

రియల్ ఎస్టేట్ రంగంలో విజయపథంలో దూసుకుపోతున్న ఎంబీజీ గ్రూప్ నెల్లూరు రూరల్ మండలం, మాదరాజుగూడూరు, కాకుపల్లి బిట్-2 ప్రాంతంలో తన కొత్త వెంచర్ ఎంజీబీ ఇన్ఫినిటీ కాకుపల్లి-2 విల్లాస్ ప్రాజెక్ట్ ఈ నెల 3న అట్టహాసంగా ప్రారంభించింది. పెద్దపెద్ద నగరాల్లో వలెనే అత్యంత అధునాతనమైన రీతిలో.. ఈ లేఅవుట్‌లో 70 విల్లాలతో అల్ట్రా మోడరన్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగింది. భూమి యజమానులు సిద్ధారెడ్డి రంగారెడ్డి, సిద్ధారెడ్డి కవితారెడ్డి, ఎస్‌వీ రోహిత్‌రెడ్డి, ఎస్‌వీ రోహన్‌రెడ్డి, ఎంజీబీ గ్రూప్ ఛైర్మన్ ఎంఆర్ గంగాధర్, మేనేజింగ్ డైరెక్టర్ ఎంజీ గోపాలకృష్ణ, ఎంజీ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎంజీ రాఘవేంద్ర తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి.. నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేతులమీదుగా ఈ ప్రారంభోత్సవం జరగడం విశేషం.

## నెల్లూరు కబుర్లు

## పేదలకు వరం..సీఎం సహాయనిధి

### ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక గొప్ప వరమని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ నిధిని పేద ప్రజల పాలిట పెన్నిధిగా మార్చి, ఎందరో అసహాయులను ఆదుకుంటున్నారని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన నెల్లూరులోని తమ కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు 36లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. పేదల ప్రాణరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 541 మందికి 4 కోట్ల 90 లక్షల రూపాయల చెక్కులు అందజేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### వివేకానంద వాకర్స్ ఆధ్వర్యంలో..

## పౌష్టికాహారం పంపిణీ



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న వాకర్స్ సభ్యులు

నెల్లూరు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు స్థానిక వివేకానంద వాకర్స్ అసోసియేషన్ వారు ఈనెల 3న పౌష్టికాహారం అందజేశారు. నెల రోజులపాటు స్టేడియంలో జరిగే శిక్షణ శిబిరంలోని క్రీడాకారులకు క్రమం తప్పకుండా కోడిగుడ్లు, బిస్కెట్లు తదితరాలతో పౌష్టికాహారం పంపిణీ చేస్తామని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కె.ఎం కొండారెడ్డి, ఆరి ప్రసాద్ తెలిపారు. దాతలు, వాకర్స్ మాజీ గవర్నర్ రాఘవేంద్రశెట్టి, రాజా రమేష్‌బాబు, నందిమండలం నాగేశ్వరరావుల సౌజన్యంతో వారు ఈ కార్యక్రమం నిర్వహించారు. వాకర్ ఇంటర్నేషనల్ స్థాపించి 40 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇంటర్నేషనల్ వాకర్ ప్రెసిడెంట్ డాక్టర్ రవిరాజు, ఇతర సభ్యులంతా కలిసి స్టేడియంలో ర్యాలీ నిర్వహించారు. ప్రెసిడెంట్ మల్లెకొండారెడ్డి, సెక్రటరీ ఆరిప్రసాద్, ట్రెజరర్ ఎం.ఖలీల్‌బేగ్, అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మేకల నరేంద్రరెడ్డి, ఏపీపీ రాఘవరెడ్డి, ఇంటర్నేషనల్ వాకర్ మాజీ ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, ఆర్‌సి శ్రీనివాసులురెడ్డి, వాకర్స్ 203 గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, డీవీ సుబ్బరాజు, పొన్నం రవిచంద్ర, స్వర్ణ రమేష్, చంద్రమౌళి, గోపాల్‌రెడ్డి, ప్రభాకర్, వేణుగోపాల్‌రెడ్డి, గఫూర్, వెంకటేశ్వర్లు, షణ్ముఖం, జయదేవ్, విజయమోహన్, వెంకట్రావు, జనార్దన్‌రెడ్డి, సుబ్బరామిరెడ్డి, నీలాద్రి, వెంకట్రావుతో పాటు పలు వాకర్స్ సంఘాలవారు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకి ధన్యవాదాలు తెలుపుతున్న పంచాయతీ అధికారులు

### ఒకేసారి 235 మంది పంచాయతీ అధికారులకు..

## ఉద్యోగోన్నతులు కల్పించిన కలెక్టర్

గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఈసారి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆధ్వర్యంలో పంచాయతీ అభివృద్ధి అధికారులకు, ఏకంగా 235 మందికి ఉద్యోగోన్నతులు కల్పిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేయడంతో, పంచాయతి అధికారుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో 111 మంది పంచయతీ అభివృద్ధి అధికారి గ్రేడ్-5లను పంచాయతీ అభివృద్ధి అధికారి గ్రేడ్-4లుగా ఉద్యోగోన్నతి కలిపించారు. అదేవిధంగా, 89 మంది పంచాయతీ అభివృద్ధి అధికారి గ్రేడ్-4లను పంచాయతీ అభివృద్ధి అధికారి గ్రేడ్-2లుగా, మరో 35 మంది గ్రేడ్-3లను, పంచాయతీ అభివృద్ధి అధికారి గ్రేడ్-2లుగా పరిగణిస్తూ ఆమేరకు కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు.

## వేడుకగా..'దర్శకరత్న' దాసరి జయంతి



సభలో మాట్లాడుతున్న అనంత్ కళాంజలి

ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ ఛాంబర్-నెల్లూరు డివిజన్ కో-ఆర్డినేటర్.. 'కళాంజలి' అనంత్ ఆధ్వర్యంలో ఇటీవల ప్రముఖ సినీ దర్శకుడు.. దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి వేడుక జరిగింది. స్థానిక అవోపా భవన్‌లో జరిగిన ఈ వేడుకలో కేకును కట్‌చేసి అందరికీ పంచారు. దాసరి నారాయణ రావును స్మరించుకుంటూ, సినీరంగానికి ఆయన చేసిన సేవలను జ్ఞాపకం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిమ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు.. ప్రముఖ సినీనటులు.. నిర్మాత-దర్శకులు విజయవర్మ, వీరిశెట్టి హజరత్‌బాబు, ఎం.ప్రసన్నాంజనేయులు, ఎన్.బలరామయ్యనాయుడు, అవోపా ప్రెసిడెంట్ గుప్తా పాల్గొని దాసరి దర్శకత్వ ప్రతిభని వివరించారు. యువ దర్శకులైన శివప్రసాద్ (అభిలాష చిత్ర దర్శకులు), వెంకటేష్ కొండిపోగు (గల్లీ గ్యాంగ్స్ సినీ దర్శకులు)లను సత్కరించారు. అనంతరం, కళాంజలి అనంత్ రచన-దర్శకత్వంలో రాబోతున్న 'గమ్..మత్తు' షార్ట్‌ఫిలిమ్ పోస్టర్‌ని వీరిశెట్టి హజరత్‌బాబు ఆవిష్కరించారు. దువ్వూరు బెనర్జీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏపీ ఫిలిమ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, పలువురు నిర్మాతలు, దర్శకులు, కళాకారులు పాల్గొన్నారు.

## 'నవోదయ' ఫలితాల్లో.. శ్రీనేతాజీ ప్రతిభ



ఇటీవల విడుదలైన జవహర్ నవోదయ 6వ తరగతి ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో నెల్లూరులోని 'శ్రీనేతాజీ (ఎంఎస్ఆర్) కోచింగ్ సెంటర్'కి చెందిన విద్యార్థులు ఎ.మహేశ్వర, సిహెచ్ రితిక, డి.ప్రణవి, డి.యాదిద్య, యం.చైత్ర, ఎస్.వర్షిత ఉత్తీర్ణులై సీట్లు సాధించారని నేతాజీ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.వి నేతాజీ సుబ్బారెడ్డి తెలిపారు. అదేవిధంగా, తొలి విడత ఫలితాల్లో 15 మంది సీట్లు సాధించారని తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందిస్తూ నిర్వహించిన కార్యక్రమంలో నేతాజీ సుబ్బారెడ్డితో పాటు, పాఠశాల ప్రెసిడెంట్ వేదవతి సుబ్బారెడ్డి, డైరెక్టర్లు కె. నరేంద్రరెడ్డి, ఎస్.సుబ్రామ్, అలేఖ్యరెడ్డి, కోరుకొండ సైనిక్ కోచింగ్ ఇన్‌చార్జి డి. హేమలత, పి.సుశీల, శోభన్‌కుమార్, పి.శ్యామల, బి.సుమిత్ర, పాఠశాల హెడ్మాస్టర్ ఎస్‌వీఎల్ నరసింహారావు, ఏటి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం



కాత్యాయనీ వ్రతాన్ని పర్యవేక్షిస్తున్న ఆలయ ఇ.ఓ కోవూరు జనార్దన్‌రెడ్డి

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 5న భక్తిశ్రద్ధలతో కాత్యాయనీ వ్రతం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో ప్రత్యేకంగా పూల అలంకరణ చేసి, ఆలయ ప్రధాన అర్చకులు సూరావఝల రఘురామమూర్తి, వేదపండితు ఆధ్వర్యంలో కాత్యాయని వ్రతం చేశారు. ఈ వ్రతాన్ని ఆచరించినందువల్ల వధూవరులకు జాతకరీత్యా కుజదోషం, కాలసర్ప దోషాలు అన్నీ తొలగిపోయి, ఉత్తమమైన వివాహం అవుతుందని వేద పండితులు తెలిపారు. అంతేకాక, స్త్రీలు సౌభాగ్యం కోసం, ఆయురారోగ్యాలు, అన్యోన్య దాంపత్యం కోసం అమ్మవారిని ప్రార్థిస్తూ నిర్వహించే ఈ వ్రతం వల్ల ఆయా కుటుంబాల్లో అశాంతి తొలగిపోయి ఆనందం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్-కార్యనిర్వహణాధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ ఛైర్మన్ ఏలూరు శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు నరేష్, జమున, దొరబాబు, నాగమణి, చంటి, తేజ, రాధాకుమారి, చిన పెంచలయ్య, వీర రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.




# నెల్లూరును గ్రీన్‌సిటీ చేస్తాం

## మంత్రి నారాయణ



మొక్కలు నాటుతున్న మంత్రి పొంగూరు

పర్యావరణ పరిరక్షణలో భాగంగా, నెల్లూరు నగరాన్ని పచ్చదనంతో కళకళలాడేలా గ్రీన్‌సిటీగా రూపొందిస్తామని రాష్ట్ర పురపాలక మంత్రి డా.పొంగూరు నారాయణ చెప్పారు. ఈనెల 3న ఆయన నగరంలోని మూలాపేటలో జరుగుతున్న మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరాన్ని పచ్చదనంతో కళకళలాడించాలన్నదే తన ధ్యేయమన్నారు. అందుకోసం కార్పొరేషన్ నుంచి ఒక్క పైసా కూడా తీసుకోకుండా తమ సొంత నిధులతో పాటు, దాతలు, స్నేహితుల సహకారంతో పెద్దఎత్తున మొక్కలు పెంచుతున్నామని తెలిపారు.

# పేదల కంటివెలుగు..'నేత్రజ్యోతి'



'నేత్రజ్యోతి' శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

పేదల కంటి వెలుగుగా 'నేత్ర జ్యోతి' వైద్య సేవలను ప్రారంభించామని, వాటిని కంటి సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి నారాయణ పిలుపునిచ్చారు. ఈనెల 5న ఆయన నెల్లూరులోని 51వ డివిజన్‌లో జరుగుతున్న 'నారాయణ నేత్ర జ్యోతి', దంత సురక్ష వైద్య శిబిరాలను పరిశీలించారు. కేవలం రెండు నెలల్లోనే 40 ప్రాంతాల్లో సుమారు 6100 మందికి కంటి పరీక్షలు, మరో 2600మందికి దంత పరీక్షలు నిర్వహించామని ఆయన తెలిపారు. వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకి మన సంస్కృతిని నేర్పించాలి

- **'నారద జయంతి' సభలో సీనియర్ జర్నలిస్టు సురేష్ కొచ్చాటిల్**

పిల్లలకి తల్లితండ్రులు మన సంస్కృతిని, ఆచారాలను నేర్పించాలని సీనియర్ జర్నలిస్టు సురేష్ కొచ్చాటిల్ (హైదరాబాద్) చెప్పారు. ఈనెల 3న నారద మహర్షి జయంతి సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో, సాహితీ సుధా ఫౌండేషన్ సారధ్యంలో స్థానిక విజయమహల్‌గేటు వద్దనున్న హోటల్ విశ్రాంత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. తల్లితండ్రులు తమ పిల్లలను కేవలం మార్కుల కోసం వత్తిడి చేయకుండా, వారిలో క్రమశిక్షణను-నైతిక విలువలను పెంపొందించాలని, ఎంతో గొప్పదైన మన సనాతన ధర్మం గురించి వారికి తెలియజెప్తుండాలని ఆయన సూచించారు. ముక్కోటి దేవతలు అంటే ఏమిటి..హనుమంతుడు జెండాపైకి ఎలా వచ్చాడు వంటి విశేషాలతో పాటు కాశీ వంటి పురాతన పుణ్యక్షేత్రాల గురించి కూడా పిల్లలకు అవగాహన కలిగించాలని ఆయనన్నారు. కొత్తతరంలో పత్రికాపఠనం బాగా తగ్గిపోయిందని, విద్యార్థులకు సబ్జెక్టు నాలెడ్జ్ మాత్రమే ఉంటోందని, పిల్లల్ని మనం విద్య పేరుతో పద్మవ్యూహంలోకి నెడుతున్నామని, పిల్లలు కూడా తమకోసం అని కాక, తల్లితండ్రుల కోసం చదువుతున్నారని, యుఎస్‌కి వెళ్ళడం కోసమే చదువు అన్నట్లుగా ఉందని ఆయన అన్నారు. 'లాయర్' వార్తాపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, లోకకల్యాణమే ధ్యేయంగా పురాణకాలంలో నారద మహర్షి ధర్మబద్ధంగా తన జీవితాన్ని సాగించారని, అదేవిధంగా ఈ యుగంలోనూ ప్రతిఒక్కరూ ధర్మాన్ని ఆచరిస్తూ సమజానికి మార్గదర్శకంగా ఉండాలని తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రాంత ప్రచారక్ బయ్యా వాసు తదితరులు పాల్గొని తమ సందేశాలనిచ్చారు. ప్రతి ఒక్కరూ దేశభక్తితో జీవించాలని, దైవభక్తి-దేశభక్తితో భావిభారత పౌరులు ఎదగాలని వక్తలందరూ ఆకాంక్షించారు. అనంతరం సురేష్ కొచ్చాటిల్‌ను, శివప్రభాత్‌రెడ్డిని నిర్వాహకులు శాలువా-జ్ఞాపికలతో సత్కరించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు, ప్రాంత సంఘచాలక్ నాగారెడ్డి హరికుమార్‌రెడ్డి, సాహితీ సుధా ఫౌండేషన్ నిర్వాహకులు నరహరి సురేష్, చింతాల ఉదయ్ పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్ట్ సురేష్ కొచ్చాటిల్‌ని సత్కరిస్తున్న నిర్వాహకులు







# టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకి కలెక్టర్ హిమాన్షు శుక్ల అభినందనలు

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2025-2026 విద్యాసంవత్సరంలో వసతి గృహాలు (హాస్టళ్ళు)లో చదువుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించి అత్యధిక మార్కులు పొందిన విద్యార్థిని, విద్యార్థులను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఇటీవల అభినందించారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు. అత్యధిక మార్కులు సాధించిన కావలి, ఉదయగిరి, పొదలకూరు పరిధిలోని విద్యార్థులైన ఏ.సంతోష్ (584), వి.వి.సూర్యప్రణీత్(574), సిహెచ్ వినీత (574), పి.ప్రవీణ్‌కుమార్ (574), ఆకుల సంతోష్ (562), జే.నిరంజన్ (561), యం.సాయిశశాంక్‌రెడ్డి (561), ట్.కార్తీక్ (558)లను కలెక్టర్ అభినందించి ప్రశంసా పత్రాలు అందజేయడంతో ఆ విద్యార్థులు ఎంతో సంతోషించారు. కలెక్టర్ మాట్లాడుతూ..అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారిని ప్రోత్సహించిన వసతి గృహ సంక్షేమ అధికారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకురాలు శోభారాణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని రెసిడెన్షియల్ హాస్టల్లో ఉండి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కలెక్టర్ ఇటీవల కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ప్రశంసా పత్రాలతో పాటు మెమొంటో అందజేసి సత్కరించారు. కావలిలోని ట్రైబల్ రెసిడెన్షియల్ హాస్టల్‌లో చదువుకుంటూ 570 మార్కులు సాధించిన బి.వెంకటకిషోర్ మరియు ట్రైబల్ వెల్ఫేర్ అగ్రహారం గొలగమూడిలో ఉంటూ 567 మార్కులు సాధించిన జీ.తేజస్విని, గొలగమూడి ఆశ్రమ హాస్టల్లో ఉంటూ 564 మార్కులు సాధించిన పి. వైష్ణవి మరియు 558 మార్కులు సాధించిన ఎస్.కె లోస్మన్‌లను జిల్లా కలెక్టర్ అభినందించారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, ట్రైనీ కలెక్టర్ పవన్‌తేజ, ఐటీడీఏ పిఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మన భారతీయ సంస్కృతి.. ఎంతో గొప్పది

## వెంకయ్యనాయుడు



'విశ్వంభరుడు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న భారత 13వ ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దీపా వెంకట్ తదితరులు

మన భారతీయ సంస్కృతి ఎంతో గొప్పదని, మన మహర్షులు యుగయుగాలుగా అనేక సంస్కారాలను మనకు అందించారని భారత 13వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఇటీవల ఆయన నెల్లూరు సమీపంలో ఉన్న గొలగమూడిలోని అవధూత, భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి మందిరంలో, రచయిత దంపూరు రామకృష్ణ రచించిన 'విశ్వంభరుడు' గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ తత్వశాస్త్రం యొక్క అసలైన సారాంశం పంచుకోవడంలోనూ, కరుణ చూపడంలోనూ (షేర్ అండ్ కేర్) ఉందని ఆయన అన్నారు. ప్రతిఒక్కరూ దైవభక్తితో, సేవాభావంతో మెలగాలన్నారు. గొలగమూడిలో శ్రీ వెంకయ్యస్వామివారి క్షేత్రాన్ని దర్శించడం తనకు అనిర్వచనీయమైన ఆధ్యాత్మిక తృప్తిని కలిగించిందన్నారు. ఆశ్రమ అభివృద్ధికి జరుగుతున్న పనులను ఆయన స్వయంగా పరిశీలించి అభినందించారు. తొలుత ఆలయంలో ఇఓ పి.బాలసుబ్రహ్మణ్యం వెంకయ్యనాయుడును స్వాగతించి, దైవదర్శనం అనంతరం ఆయన్ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడి కుమార్తె, ఆశ్రమ కమిటీ సభ్యురాలు దీపా వెంకట్, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఆర్టీసీ జోనల్ ఛైర్మెన్ సురేష్‌రెడ్డి, 'లాయర్' వార్తాపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి, పేర్నాటి ఆదిశేషారెడ్డి, జి.వి.రమణారెడ్డి, ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, రచయిత దంపూరు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్‌లో..

# పూర్వ విద్యార్థుల సందడి



కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో ఇటీవల 2004-2008 వ సంవత్సరంలో ఇంజనీరింగ్ కోర్సును పూర్తిచేసిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తాము అప్పట్లో చదువుకున్న తరగతి గదులను కలయతిరుగుతూ వారు సంతోషపడ్డారు. ఆనాటి స్నేహాలను, పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని ఆనందపరవశులయ్యారు. అప్పట్లో అధ్యాపకులు తమకు క్రమశిక్షణతో చదువుకోవడం నేర్పారని, అందువల్ల ఇప్పుడు తామంతా ఉన్నత రంగాల్లో స్థిరపడ్డామని వారు ఒకరికొకరు ఆ విశేషాలను స్నేహితులతో పంచుకున్నారు. తమకు చదువు చెప్పిన అధ్యాపకులకు ఆత్మీయంగా సన్మానాలు చేసి కృతజ్ఞతలు చెప్పుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు, పలు శాఖల అధ్యాపకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

# జన గణనకు ప్రజలు సహకరించాలి

## - తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్



దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన-2027లో భాగంగా ఇంటి వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సరైన సమాధానం ఇచ్చి సహకరించాలని గూడూరు మండల తహశీల్దార్ ఆర్.వి.ప్రసాద్ కోరారు. సోమవారం గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనగణన 2026 ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు స్వీయ గణన కార్యక్రమం ముగిసిందని, మే ఒకటి నుండి ఇంటింటికి వచ్చి ప్రభుత్వం నియమించిన ఎన్యూమరేటర్లు 33 అంశాలతో కూడిన సమాచారాన్ని సేకరిస్తారని, ఆ సమాచారం కూడా గోప్యంగా ఉంచుతారని ఆయన తెలిపారు. అందుకు ప్రజలు సహకరించి సమాచారం ఇవ్వాలన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్ష

గూడూరులో నీట్ పరీక్షలను అధికారులు పకడ్బందీగా నిర్వహించారు. మొత్తం మూడు సెంటర్లు ఎస్.కె.ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజ్, పాలిటెక్నిక్ కళాశాల, జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లలో నీట్ పరీక్షను నిర్వహించగా, మొత్తం 471 మంది విద్యార్థుల్లో 450 మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. గూడూరు ఆర్డీవో సత్యనారాయణ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.






శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న కడివేటి చంద్రశేఖర్, మాలకొండయ్య

# స్కేటింగ్ వేసవి శిక్షణ శిబిరం

గూడూరు రెండో పట్టణ పరిధిలోని టిటిడి కళ్యాణ మండపంలో చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన స్కేటింగ్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ ఇటీవల ప్రారంభమైంది. స్కేటింగ్ కోచ్ విజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణా తరగతులను ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, రెండో పట్టణ సిఐ మాలకొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, టీవీలకు పరిమితం కాకుండా, ఇలాంటి క్రీడల్లో శిక్షణ పొందడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు. టిటిడి మేనేజర్ శివ, టైక్వాండో కోచ్ సురేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహనీయుడు కార్ల్ మార్క్స్



కార్ల్ మార్క్స్‌కి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

మహనీయుడు కార్ల్ మార్క్స్ అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి. హెచ్.ప్రభాకర్ పేర్కొన్నారు. ఇటీవల గూడూరులోని సీపీఐ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ 208వ జయంతి సందర్భంగా గూడూరు సీపీఐ సమితి వారు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ మానవ చరిత్ర గతిని నిర్ణయించేవి ఆర్థిక పరిస్థితులే కానీ రాజకీయ మత, సాంస్కృతిక పరిస్థితులు కావు అని చెప్పిన గొప్ప తత్వవేత్త మార్క్స్ అని పేర్కొన్నారు. సీపీఐ నియోజకవర్గ అధ్యక్షులు జి.శశి కుమార్, సహాయక కార్యదర్శి జమాలుల్లా, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, అన్వేష్, ఏ.ఐ.ఎస్.ఎఫ్ నాయకులు రిజ్వాన్, హర్షద్, దీవెన్‌కుమార్ పాల్గొన్నారు.

# పదిలో 'లిటిల్ ఏంజెల్స్' విజయ కేతనం



విద్యార్థినీవిద్యార్థులను అభినందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

పది ఫలితాల్లో లిటిల్ ఏంజెల్స్ పాఠశాల మరోసారి సత్తా చాటింది. పాఠశాల టాపర్‌గా 589 మార్కులతో శ్రీ సాయి అశ్లేష నిలవగా.. 587 మార్కులతో రేవంత్ ద్వితీయ స్థానం సాధించాడు. అలాగే 585 మార్కులతో హాసిని తృతీయ స్థానంలో నిలిచింది. పరీక్షలకు 57 మంది విద్యార్థులు హాజరు కాగా.. వారిలో 500 మార్కులకు పైగా సాధించిన వారు 43 మంది కావడం సంచలనం. గణితంలో 11 మంది, తెలుగులో ఆరు మంది, సోషల్‌లో నలుగురు నూరు శాతం ఫలితాలు సాధించారు. నూరు శాతం ఫలితాలతో అందరూ ప్రథమ శ్రేణిలో నిలవడం విశేషం. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

# నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న డా. సి.రోహిణి

గూడూరు, త్యాగరాజవీధిలోని శ్రీ కళ్యాణవీరభద్రస్వామి దేవస్థానంలో రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్ & ఆంధ్రమహిళా మండలి వారి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు ఇటీవల నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా డా. సి.రోహిణి విచ్చేశారు. విజయభాస్కర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి సతీమణి విద్య ఈ వస్తువులు అందజేశారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి.మాధురి, సభ్యులు పాల్గొన్నారు.

# ‘అక్షరోత్సవం’ అవార్డుల ప్రదానం.. 10న

## ప్రముఖ కవి కొప్పర్తికి ‘చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్’ పురస్కారం



చిన్ని నారాయణరావు

నెల్లూరులోని ప్రముఖ కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 3వ అక్షరోత్సవం అవార్డుల ప్రదానం’ కార్యక్రమం ఈనెల 10వతేదీ ఆదివారం జరుగుతుంది. ఈ సందర్భంగా సాహితీరంగంలో ఎంతో కాలంగా ఉత్తమ సేవలందిస్తున్న పలువురు సాహితీవేత్తలకు ఫౌండేషన్ తరపున అవార్డులనిచ్చి గౌరవించనున్నారు. ఫౌండేషన్ అధ్యక్షులు.. కళారత్న చిన్ని నారాయణరావు, కార్యదర్శి చిన్ని శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో నెల్లూరు టౌన్‌హాలులో ఆరోజు సాయంత్రం 6.05 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ‘లాయర్’ వార్తా పత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. శాసన మండలి సభ్యులు.. నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షురాలు మేకపాటి శాంతికుమారి, ‘శుభమస్తు’ షాపింగ్‌మాల్ అధినేత బయ్యా శ్రీనివాసులు, కళాంజలి గౌరవాధ్యక్షులు వీరిశెట్టి హజరత్‌బాబు, నవ మల్లెతీగ పత్రిక సంపాదకులు కలిమిశ్రీ (విజయవాడ), ప్రముఖ కవి, రచయిత శ్రీరామకవచం సాగర్(ఒంగోలు) ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు.



కొప్పర్తి వెంకటరమణ



మద్దూరు శ్రీనివాసులు



వైహెచ్‌కె మోహనరావు



గంగవరపు సునీత

### అవార్డు గ్రహీతలు వీరే :

అక్షరోత్సవం అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా, సుప్రసిద్ధ కవి-రచయిత, హైదరాబాద్‌కి చెందిన కొప్పర్తి వెంకటరమణ మూర్తికి ప్రధానమైన చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ అవార్డుతో పాటు, 10వేల రూపాయల నగదు బహుమతినిచ్చి సన్మానించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా, మరో ముగ్గురు సాహితీవేత్తలకు 3వేల రూపాయల వంతున నగదు బహుమతులతోపాటు, జ్ఞాపికలనిచ్చి సత్కరించనున్నారు.

అక్షరయోధులు..‘లాయర్’ పత్రిక సంపాదకులు..స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి స్మారకంగా బహుకరించే అవార్డును.. ‘లాయర్’ పత్రిక సబ్‌ఎడిటర్, కవి-రచయిత-సీనియర్ పాత్రికేయులు మద్దూరు శ్రీనివాసులు (నెల్లూరు)కు ప్రదానం చేయనున్నారు. ప్రముఖ సాహితీవేత్త దివంగత సత్యవేటి శ్రీకాంత్ స్మారక పురస్కారాన్ని ప్రముఖ కవి-రచయిత వైహెచ్‌కె మోహనరావు (పిడుగురాళ్ళ)కు, విఖ్యాత కవి..కీర్తిశేషులు డా.నాగభైరవ కోటేశ్వరరావు స్మారకార్థం ప్రదానం చేసే అవార్డును ప్రముఖ కవయిత్రి.. రచయిత్రి గంగవరపు సునీత (చిలకలూరిపేట)కు బహుకరించనున్నట్లు వారు వివరించారు.

### ‘కళాంజలి’ ఆధ్వర్యంలో..సంగీత విభావరి :

ఈ కార్యక్రమాల్లో భాగంగా, కళాంజలి అనంత్ సారథ్యంలో ‘సినీ సంగీత విభావరి’ జరుగుతుంది. అంతేకాక, చిన్ని నారాయణ రావు రచించిన ‘వెలుగుపూల వసంతం’తో పాటు, ఆయన సంపాదకత్వంలో ముద్రితమైన ‘అక్షరోత్సవం-నెల్లూరు కవుల కవితాభిషేకం’ పుస్తకాన్ని, ప్రముఖ కవి ఏటూరి నాగేంద్రరావు రచించిన ‘ఒక అశాంతుడి స్వప్నం’ కవితల సంపుటిని ముఖ్య అతిథులు ఆవిష్కరించనున్నారు. తొలుత, సాయంత్రం 4గంటలకు కవిసమ్మేళనం-కవితల పోటీ నిర్వహించనున్నారు. ఇందులో ఎంపికైన 5 ఉత్తమ కవితలకు 500 రూపాయల వంతున, ద్వితీయంగా ఎంపికైన మరో 5 ఉత్తమ కవితలకు 250 రూపాయల వంతున బహుమతులు ప్రదానం చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ సాహిత్యోత్సవానికి సాహిత్యాభిమానులు, కవులు-కళాకారులందరూ విచ్చేసి జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తిచేస్తున్నారు.

# ‘కంచి’ వారి..మంచితనం



బాధిత కుటుంబాలకి ఆర్థిక సహాయం అందజేస్తున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరుకు చెందిన ప్రముఖ దాత, సాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ నిర్వాహకులు కంచి పరమేశ్వరరెడ్డి తన మంచితనంతో బాధిత కుటుంబాలవారిని, నిరుపేదలను ఎందరినో మానవతా దృక్పథంతో ఆదుకుంటున్నారు. పేదల ఇళ్ళలో ఎవరైనా చనిపోతే, ఆ కుటుంబాలకు సాయంగా తనవంతు చేదోడు అందిస్తున్నారు. ఆత్మకూరు మునిసిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన జెడ్డా రత్తమ్మ, 21వ వార్డుకి చెందిన దాసరి శంకరమ్మలు మరణించగా, ఆయా కుటుంబాల దీనస్థితిని గమనించి ఈనెల 3న తనవంతుగా ఆ కుటుంబాలకి 10వేల రూపాయల వంతున ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా, ఆత్మకూరు మండలంలోని మహిమలూరులో బోయిళ్ళ గురువయ్య, కరటంపాడుకు చెందిన ఏ.శేషమ్మ మృతిచెందగా, వారి కుటుంబాలకు కూడా 10వేల రూపాయల వంతున సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చారిటీస్ సభ్యులు నరసింహారెడ్డి, రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, కట్టా మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ ఆధ్వర్యంలో.. మజ్జిగ చలివేంద్రం

- ప్రారంభించిన పర్వతరెడ్డి



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నెల్లూరులోని 54వ డివిజన్ జనార్దన్ రెడ్డి కాలనీలో వైసీపీ డివిజన్ ఇన్‌చార్జి మస్తాన్ చలివేంద్రం ఏర్పాటుచేశారు. ఈనెల 3న వైసీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దానికి ప్రారంభోత్సవం చేసి అందరికీ చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఆధ్వర్యంలో ప్రజలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పేర్నాటి కోటేశ్వరరెడ్డి, స్థానిక నాయకులు వెంగళరెడ్డి, ఖాజాబాబా, శివనాగప్రసాద్, ప్రకాష్, కరిముల్లా,, మున్నా, సలాం, అస్లాం, షరీఫ్, సలోమి, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

# పాలిసెట్ ఫలితాల్లో..92.70 శాతం ఉత్తీర్ణత

ఇటీవల విడుదలైన పాలిసెట్-2026 ఫలితాల్లో నెల్లూరుజిల్లా 92.70 శాతం ఉత్తీర్ణత సాధించింది. జిల్లాలో మొత్తం 4888 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షలు రాయగా, అందులో 4531 మంది ఉత్తీర్ణులయ్యారు. వారిలో బాలురు 3184 మంది పరీక్షలు రాస్తే, 2916 మంది, పరీక్షలు రాసిన 1704 మంది బాలికల్లో 1615 మంది పాసవడం విశేషం.

# ‘దృష్టి’ మారితే..దారి తప్పినట్లే!..

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

నేటి ఆధునిక కాలంలో డిజిటల్ యుగం మనకు అపారమైన అవకాశాలు ఇచ్చింది. జ్ఞానాన్ని వేల మైళ్ల దూరంలో కాదు – మనచేతిలోని ఒక చిన్న స్క్రీన్‌లోనే పెట్టింది. కానీ అదే స్క్రీన్.. మన దృష్టిని చెదరగొట్టే శత్రువుగా కూడా మారింది. చదువులో దృష్టిని నిలబెట్టుకోవడం ఇప్పుడు కేవలం ఒక అలవాటు కాదు.. ఒకనైపుణ్యం, ఒక యుద్ధం, ఒక సాధనగా తయారైంది. ఈ యుద్ధంలో గెలిచినవారే భవిష్యత్తును నిర్మిస్తారు. అందుకే పురాతన సూక్తి చెబుతుంది: “దృష్టిః యత్న సిద్ధానాం మూలం”.. దృష్టిలేకుండా ఏ సాధనకూ అర్థం లేదు. ప్రపంచంలోని ప్రతి విద్యార్థి ఇప్పుడు ఒకే సమస్యను ఎదుర్కొంటున్నారు. డిజిటల్ వారిని దారితప్పిస్తోంది. నోటిఫికేషన్లు, రీల్స్, గేమ్స్, చాట్‌లు, మీమ్స్..వగైరాలన్నీ మన మెదడును చిన్నచిన్న ముక్కలుగా విభజిస్తాయి. మనం చదువుతున్న పుస్తకం ఒకవైపు, మన దృష్టిని లాగుతున్న స్క్రీన్ మరోవైపు. ఈ రెండిటి మధ్య జరిగే పోరాటంలో చాలా మంది విద్యార్థులు ఓడిపోతున్నారు కూడా.

### డిజిటల్ ప్రపంచం..జ్ఞానానికి దిక్సూచి :

ఒక చిన్న ఉదాహరణ తీసుకుందాం. హైదరాబాదులో చదువుతున్న పదో తరగతి విద్యార్థి రాహుల్.. పరీక్షలకు ఇంకా రెండు వారాలే ఉన్నాయి. చదవడానికి కూర్చుంటాడు. కానీ ఫోన్‌లో ఒక సందేశం వచ్చింది. ‘నీ స్నేహితుడు కొత్త వీడియో పెట్టాడు’ అని. రాహుల్ అనుకుంటాడు: “ఒక్కసారి చూస్తాను అని. ఆ ఒక్కసారి పది నిమిషాలు అవుతుంది. పది నిమిషాలు అరగంట అవుతుంది. చివరికి చదువు మొదలుపెట్టకముందే అలసట వచ్చేస్తుంది. ఇది రాహుల్ సమస్య కాదు – ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది విద్యార్థుల సమస్య. మన పురాతన గ్రంథాలు చెబుతాయి: “యోగా: చిత్తవృత్తి నిరోధః” – అని. మనసు ఎటుపడితే అటు పరుగెత్తకుండా నిలబెట్టడం ఒక సాధన. చదువుకూడా అదే. దృష్టిని నిలబెట్టడం ఒక యోగా. ఈ యోగాని నేర్చుకున్నవారే డిజిటల్ ప్రపంచాన్ని జయించగలరు. డిజిటల్ ప్రపంచం చెడు కాదు. అది మనకు దిక్సూచీ. దానిని ఎలా ఉపయోగిస్తామన్నదే అసలు విషయం. కత్తి ఒకరి చేతిలో రక్షణ, మరొకరి చేతిలో ప్రమాదం అవుతుంది. ఫోన్ కూడా అలాగే. దాన్ని జ్ఞానానికి వాడితే అది గురువు. దాన్ని దారితప్పింపులకు వాడితే అది శత్రువు. ఒకసారి అమెరికాలోని ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధనలో విద్యార్థులను రెండు బృందాలుగా విభజించారు. ఒక బృందం వారు చదువుతున్నప్పుడు ఫోన్‌ను పక్కన పెట్టేశారు. మరొక బృందం ఫోన్‌ను సైలెంట్‌లో ఉంచి టేబుల్‌పై పెట్టింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే. ఫోన్‌ను టేబుల్‌పై పెట్టిన విద్యార్థుల దృష్టి 20 నుంచి 25 శాతం తగ్గింది. ఎందుకంటే మెదడులోని ఒక చిన్న భాగం ఎప్పుడూ ఆ ఫోన్ వైపు దృష్టి పెట్టి ఉంటుంది. ఇది మనకు ఒక పెద్ద పాఠం చెబుతుంది. ఫోన్‌ను దూరంగా పెట్టడం అంటే మన దృష్టిని తిరిగి పొందడమని గుర్తుంచుకోవాలి.

### రీల్స్ మీద కాదు..చదువు మీదే దృష్టి ఉండాలి :

ఒక చిన్న కథ. జపాన్‌లో ఒక విద్యార్థి ప్రతిరోజూ చదువుకునేందుకు కూర్చునే ముందు తన ఫోన్‌ను ఒక చిన్న పెట్టెలో వేసి మూసేస్తాడు. ఆ విద్యార్థి చెబుతాడు: ‘నా దృష్టి నా చేతుల్లో ఉండాలి, నా ఫోన్ చేతుల్లో కాదు. ఈ చిన్న అలవాటు ఆ విద్యార్థి తన తరగతిలో అగ్రస్థానానికి తీసుకెళ్లింది. చదువులో దృష్టిని పెంచుకోవడానికి ప్రపంచంలోని ప్రతి విద్యార్థికి ఉపయోగపడే కొన్ని ఆలోచనలు ఉన్నాయి. అవి నియమాలు కాదు..జీవనవిధానం. ఉదాహరణకు, “పొమోడోరో టెక్నిక్” ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి. 25 నిమిషాలు చదువు, 5 నిమిషాలు విరామం. ఇది మన మెదడుకు సహజమైన రిథమ్ ఇస్తుంది. కానీ ఇది కేవలం ఒక పద్ధతి మాత్రమే. అసలు శక్తి మనలోని సంకల్పం. ఒకసారి ఒక గురువు తన శిష్యునికి చెప్పాడు..“దృష్టి అంటే కళ్లతో చూడటం కాదు, మనసుతో నిలబడటం”. ఈ మాటలో గొప్ప సత్యం ఉంది. మనసు నిలబడితే చదువు నిలుస్తుంది. మనసు చెదిరితే పుస్తకం ఎంత మంచిదైనా ప్రయోజనం లేదు. సంకల్పం, సమయం పట్ల గౌరవం, స్వీయ నియంత్రణ. ఇవి మనసులో పెరిగితే ఫోన్ మనపై పెత్తనం చేయదు. మనమే ఫోన్‌ను శాసించగలం. ఒక ఉదాహరణ.. కెనడాలో చదువుతున్న ఒక భారతీయ విద్యార్థిని ప్రతిరోజూ రాత్రి 9 తర్వాత ఫోన్‌ను ఆఫ్ చేస్తుంది. ఆమె చెబుతుంది: ‘నా భవిష్యత్తు నాకు ముఖ్యం. దానికి నేను సమయం ఇవ్వాలి’... ఈ చిన్న నిర్ణయం ఆమెను స్కాలర్‌షిప్ పొందే స్థాయికి తీసుకెళ్లింది. చదువు అంటే కేవలం మార్కులు కాదు. అది మనసును తీర్చిదిద్దే ప్రక్రియ. డిజిటల్ ప్రపంచం మనకు జ్ఞానాన్ని ఇస్తుంది, అందుకే మన దృష్టిని మనమే కాపాడుకోవాలి. ‘ఆలస్యం అమృతం విషం’ అన్నట్లుగా ఒక్కోసారి అలస్యం కూడా పెద్ద నష్టానికి దారితీస్తుంది. ప్రపంచంలోని ప్రతి విద్యార్థికి ఒక సందేశం ఏమిటంటే..మీరెక్కడ ఉన్నా..‘మీ దృష్టి మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని’ గుర్తుంచుకోవాలి. డిజిటల్ ప్రపంచం మీకు సహాయకుడుగాఉండాలే తప్ప, మిమ్మల్ని శాసించే అధిపతి కాదు..కాకూడదు. అందుకే మీ ఏకాగ్రతకు భంగం కలగకుండా మీ దృష్టిని కాపాడుకోండి. మీ సమయాన్ని సద్వినియోగం చేసుకుని మీ భవిష్యత్తును నిర్మించుకోండి. డిజిటల్ ప్రపంచాన్ని జయించాలంటే.. అది మీ చేతుల్లోనే ఉందని తెలుసుకోండి!...



**వచ్చే వారం :** స్వయంగా నేర్చుకునే శక్తి: వ్యక్తిగత అధ్యయన వ్యవస్థ నిర్మాణం

E-mail: reddyu@gmail.com

# కల్యాణ వైభవం...!

## శ్రావణి - కౌశిక్



భారతదేశ 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడికి అత్యంత ఆప్తుడు, ప్రముఖ వ్యాపారవేత్త అనపల్లి అశోక్‌రెడ్డి మేనల్లుడు పల్లంపర్తి శ్యామ్‌కుమార్‌రెడ్డి - శ్రీమతి సరితల కుమార్తె **డాక్టర్ శ్రావణి - డాక్టర్ సాయి కౌశిక్‌రెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు పుట్టం వెంకటేశ్వరరెడ్డి - శ్రీమతి అనూరాధల కుమారుడు)ల పెళ్ళి వేడుక మే 1వ తేదీ నెల్లూరులో జరిగింది. వెంకయ్యనాయుడితో సహా అనేకమంది ప్రముఖులు ఇరు కుటుంబాల బంధుమిత్రులు ఈ వేడుకలో పాల్గొని కొత్త జంటని దీవించారు. వధూవరులకి 'లాయర్' శుభదీవెనలు.





## అరుణకృష్ణ - లోకేష్

రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు వ్యక్తిగత కార్యదర్శి పచ్చబొట్ల లక్ష్మి శ్రీనివాస్ - దివంగత శ్రీమతి రేవతిల కుమార్తె **అరుణ కృష్ణ - లోకేష్ మణికంఠ కుమార్** (ధవళేశ్వరం వాస్తవ్యులు వెంకటరమణమూర్తి - శ్రీమతి అనంతలక్ష్మిల కుమారుడు)ల కళ్యాణం ఇటీవల నెల్లూరులో జరిగింది. బీద మస్తాన్‌రావు, నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి దంపతులతో పాటు జిల్లాలోని అనేకమంది రాజకీయ, రాజకీయేతర ప్రముఖులు ఈ శుభకార్యంలో పాల్గొని నవ దంపతులని దీవించారు. కొత్త జంటకి 'లాయర్' శుభాకాంక్షలు.

# విద్యార్థినులకు.. ఎంపీ విపిఆర్ ప్రశంస



విద్యార్థినులను అభినందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థినులను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశంసించారు. వింజమూరులోని శ్రీ నేతాజీ వికాస్ హైస్కూల్ అండ్ కాలేజ్‌లో చదువుతున్న విద్యార్థిని సిహెచ్ లిఖిత 600 మార్కులకు గాను, 598 మార్కులు సాధించి జిల్లాలో మొదటి స్థానం సాధించడమే కాక, రాష్ట్రంలో రెండవ స్థానం కైవసం చేసుకోవడం హర్షదాయకమన్నారు. అలాగే 595 మార్కులతో ఎల్లాల భావన ఉత్తీర్ణురాలు కాగా, వారు ఇటీవల నెల్లూరులోని విపిఆర్ నివాసంలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వారిని అభినందించారు. ఎల్‌సీ రమణారెడ్డి, కె.వి రత్నం, ఎన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# యువశక్తితోనే పార్టీ బలోపేతం

**నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**



యువజన విభాగం నాయకులతో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

యువశక్తితోనే పార్టీ బలోపేతమవుతుందని వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల ఆయన వెంకటగిరి నియోజకవర్గంలోని వైసీపీ యువజన విభాగం నాయకులతో సమావేశమై, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను సమీక్షించారు. ప్రతి గ్రామంలో చురుకైన నాయకత్వాన్ని గుర్తించి బాధ్యతలు అప్పగిస్తున్నామని, నియామకాల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. పార్టీలో పదవులు పొందిన వారు ప్రజలకు అందుబాటులో ఉండాలని, పార్టీ గుర్తింపు కార్డులతో కార్యకర్తలకు ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని, పార్టీ కార్యకలాపాల్లో అధికారిక గుర్తింపుగా ఆ కార్డులు ఉపయోగపడతాయని తెలిపారు.



# ఆణిముత్యాలు..'డీఎస్ఆర్' విద్యార్థులు



విద్యార్థినులను అభినందిస్తున్న ట్రస్ట్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి

నెల్లూరుజిల్లా అల్లూరు మండలం నార్త్‌మోపూరు గ్రామంలో ఉన్న డీఎస్ఆర్ హైస్కూలు (దేవిరెడ్డి శారద హైస్కూలు) విద్యార్థినులు టెన్త్‌లో ఉత్తమమార్కులు సాధించి ఆణిముత్యాలనిపించారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో ఈ స్కూల్‌కి చెందిన కె. హరిణి 600 మార్కులకు గాను 585 మార్కులు సాధించడం విశేషం. అదేవిధంగా ఈ స్కూల్‌కి చెందిన మరో ఇద్దరు విద్యార్థినులు టి. వెన్నెల 583 మార్కులు, కె.చైత్ర 580 మార్కులు సాధించినట్లు డీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజర్ ఐ.అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మొత్తం 55 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణులై నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అందులో ముగ్గురికి 580 మార్కులకు పైగా, ఆరుగురికి 570కి పైగా, 24 మందికి 550కి పైగా, 46 మందికి 500కి పైగానే మార్కులు వచ్చాయని ఆయన వివరించారు. ఉత్తమ శ్రేణిలో మార్కులు తెచ్చుకున్న వారందరినీ డీఎస్ఆర్ ట్రస్ట్ తరఫున ఆయన అభినందించారు.

# కమ్మ సంఘం కొత్త కార్యవర్గం



కమ్మ జన సంక్షేమ సమితి నూతన కార్యవర్గ సభ్యులు

నెల్లూరుజిల్లా కమ్మ జన సంక్షేమ సమితి నూతన కార్యవర్గాన్ని ఇటీవల స్థానిక దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా రావి మోహన్‌చౌదరి, ఎలమూరి రంగయ్యనాయుడు, అధ్యక్షునిగా రుద్రపాటి వెంకటేశ్వర్లు నాయుడు, ప్రధాన కార్యదర్శిగా చౌదరి పెట్రోల్ బంక్ అధినేత పేరం రవికుమార్ చౌదరి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా సూరపనేని మల్లికార్జున్‌నాయుడు, మాలెపాటి చైతన్య, సలహాదారులుగా మద్దిపాటి ప్రసాదరావు, కన్నెధారి చంద్రశేఖర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వీరేపల్లి అశోక్, కోశాధికారిగా కొల్లూరు బాలకృష్ణ చౌదరి ఎన్నికయ్యారు. సెక్రటరీలుగా గుడిపాటి నరసింహులు, నలుబోలు బలరామయ్య, వింజమూరు నరసింహనాయుడు, గుడ్లూరు రవిచంద్ర, పబ్లిసిటీ సెక్రటరీగా పొత్తూరు రాధాకృష్ణలను ఎన్నుకున్నారు. క్రియాశీల కమిటీ సభ్యులుగా వెంకట నరసయ్యనాయుడు, కిలారి శ్రీనివాసులనాయుడు, వి.సంజీవయ్య. జి.శ్రీహరినాయుడు, వాసిరెడ్డి చిరంజీవినాయుడు, సూరపనేని జనార్దన్ నాయుడు, తాళ్ళూరి మారుతి నరహరి, ఎం.వెంకట కృష్ణయ్య, టి.శ్రీనివాసరావు, కమ్మ పెద్ద పెంచలనాయుడు, పచ్చా మాల్యాద్రి, తాళ్ళూరి వెంకటేశ్వర్లు, ఎల్.బాబు, కే.అశోక్ చక్రవర్తి, ఎనుగంటి నాగేంద్ర, జవ్వాజి రమేష్‌లు ఎన్నికయ్యారు. జిల్లా కమ్మ సంఘాన్ని బలోపేతంచేసి పేదవిద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, వైద్య సాయం, వివాహ పరిచయ వేదికలు వంటి సంఘ పురోభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఈ సందర్భంగా ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యవర్గంలోని కీలక సభ్యులు.. మాజీ అధ్యక్షులు, హోటల్ మోతిమహల్ అధినేత నవీన్ చౌదరి, వీఆర్ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు శివరాం నాయుడు, కిలారి సుబ్రహ్మణ్యంనాయుడు, దండమూడి హేమంత్, మధుసూదన్ నాయుడు, సిటీ బేకరీ అధినేత వల్లూరి మహేష్, పావులూరి సుందరరామయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# సమ్మోహన శక్తి మోడీ

(మొదటిపేజీ తరువాయి)

కొరకురాని కొయ్యగా, మాటవినని మొండి ఘటంగా, అక్కడ భాజపాని ముప్పుతిప్పలు పెట్టిన దీదీని గద్దెదించి తనకు ఎదురేలేదని చాటిచెప్పారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ముందు అందరూ అనుకున్నట్లు అస్సాం, పుదుచ్చేరిలో కమలమే వికసించింది. అయితే దశాబ్దాలుగా అందని ద్రాక్షగా మారిన పశ్చిమ బెంగాల్‌ను చేజిక్కించుకోవడం మాత్రం అనూహ్యం, అసామాన్యమనే చెప్పాలి. ఎందుకంటే మూడున్నర దశాబ్దాల కమ్యూనిస్టు కంచుకోటలను బద్ధలు కొట్టి, 15 సంవత్సరాలుగా అప్రతిహతంగా మమత బెంగాల్‌ను పాలించారు. ఒకానొక దశలో అటు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏలోనూ, ఇటు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేలోనూ రైల్వే మంత్రిగా చక్రం తిప్పుతూ, తన పార్టీ తృణముల్‌కాంగ్రెస్‌ను మమత బెంగాల్‌లో అత్యంత పటిష్టంగా తీర్చిదిద్దారు. ఎవరికీ అందనంత స్థాయికి చేరుకున్నారు. అయితే పట్టువదలని విక్రమార్కుడిలా మోడి తన సహచరులైన అమిత్‌షా, నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ వంటి నేతలను బెంగాల్‌లో మోహరించి తృణముల్ కాంగ్రెస్‌ను కకావికలం చేశారు. ఏకంగా 206 స్థానాలను చేజిక్కించుకుని మరోసారి కమలం పంచ్ పవర్‌ను రుచి చూపించి గడ్డి పువ్వును పాతాళానికి తొక్కిపడేశారు.

## ఉవ్వెత్తున ఎగసిన కెరటం మమత...!

సరైన వ్యూహం, పక్కా ప్రణాళిక, సుదీర్ఘమైన ఓర్పు ఉంటే కానీ అడవికి రారాజుగా చెప్పుకునే సింహాన్ని బంధించడం అసాధ్యం. ఈ దశలో ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా, సింహాన్ని బంధించడం అటుంచి, దానికి ఆహారం కావడం తథ్యం. సరిగ్గా ఇదే పరిస్థితి బెంగాల్ రాజకీయాల్లో కనిపించింది. అక్కడ బెంగాల్ బెబ్బులిగా తనను తాను ప్రొజక్ట్ చేసుకునే మమతా బెనర్జీ తన నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో బెంగాల్‌లో తిరుగులేని నేతగా ఎదిగారు. తొలుత కాంగ్రెస్ కార్యకర్తగా, యువజన విభాగం చీఫ్‌గా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి తర్వాత అంచెలంచెలుగా ఎదుగుతూ, అప్పట్లో కమ్యూనిస్టు దిగ్గజం సోమనాథ్ చటర్జీపై అనూహ్య విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టారు. తర్వాత కాలంలో కాంగ్రెస్ అధిష్టానంతో పొసగక తృణముల్ కాంగ్రెస్ పేరుతో సొంత పార్టీని ఏర్పాటు చేసుకుని సింగూర్ వంటి అసమాన పోరాటాలతో ముందుకు సాగారు. అప్పటి వరకు ఏకఛత్రాదిపత్యంగా బెంగాల్‌ను ఏలుతున్న కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గద్దెదించి, బెంగాల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు. ఈ క్రమంలో పోరాటాలే ఊపిరిగా నిరసనలు, ధర్నాలు, హర్తాళ్లు, రాస్తారోకోలే మార్గాలుగా ఆమె బెంగాల్ ప్రజల్లో ఊహించని ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఒకానొక దశలో 'బెంగల్ అంటే మమత', 'మమత అంటే బెంగాల్' అనేలా ఘనకీర్తిని సంపాదించుకున్నారు.

## ప్రోత్సహించిన వారికే చెక్‌పెట్టి...!

తృణముల్ కాంగ్రెస్‌ను స్థాపించిన తొలి దశలో కాంగ్రెస్, బీజేపీ రెండూ తమ అవసరాల కోసం మమతను ఆయా దశల్లో ప్రోత్సహించాయి. దీంతో అటు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వంలోనూ, ఇటు బీజేపీ ఆధ్వర్యంలోని ఎన్డీయేలోనూ మమతాబెనర్జి చక్రం తిప్పారు. రైల్వే మంత్రిగా జాతీయ స్థాయిలో ఇమేజ్‌ను ఇనుమడింప జేసుకున్నారు. ఇక అప్పట్లో బెంగాల్‌లో కమ్యూనిస్టు ప్రభుత్వం అప్రతిహతంగా సాగేది. అయితే ముఖ్యమంత్రి జ్యోతిబస్సు కేబినెట్ తీసుకున్న సింగూర్‌లో సెజ్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకించి రైతులతో కలిసి మమతా బెనర్జీ మహా పోరాటం చేశారు. తద్వారా బెంగాల్‌లో ఏకైక ప్రత్యామ్నాయం తానే అంటూ దినదిన ప్రవర్ధమానంగా ఎదిగారు. తర్వాత కమ్యూనిస్టులతో పాటు కాంగ్రెస్‌కు చెక్ చెప్పి బెంగాల్‌లో వరుసగా మూడు పర్యాయాలు ముఖ్యమంత్రి పీఠాన్ని చేజిక్కించుకున్నారు. ఈక్రమంలో ఆమె కమనాథులను సైతం బెంగాల్‌లో అడుగు పెట్టకుండా నిన్నటివరకు సమర్థంగా నిలువరించగలిగారు.


## అష్టదిగ్బంధంతో గద్దెదించి..!

దేశంలో ఏ నేత వచ్చినా, ఏ పార్టీ వచ్చినా బెంగాల్‌లో మాత్రం మా తర్వాతే అనేలా తృణముల్ కాంగ్రెస్ పాలన సాగింది. అయితే మమతా బెనర్జీ మొండి అయితే నేను జగమొండి, ఆమె శక్తి అయితే నేను మహాశక్తి అంటు మోదీ బెంగాల్ ఎన్నికల్లో ప్రచారం సాగించారు. ఈక్రమంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్)తో తొలుత బెంగాల్ ఓటర్ల జాబితాలో ఉన్న 90లక్షల పైచిలుకు అక్రమార్కులు, వలసదారులను ఏరిపారేశారు. ఇది మమతకు గట్టి ఎదురుదెబ్బగా మారింది. అలాగే మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ అవినీతిని, అక్రమాలను ప్రజల ముందు ఎండగట్టేలా ప్రణాళికలు రచించారు. ఈక్రమంలో ఈడీ, సీబీఐ కేసులతో ఉక్కిరిబిక్కిరి చేశారు. ఇక మమత ప్రభుత్వంలో చోటు చేసుకున్న శారద, నారద, ఉపాధ్యాయ నియామక కుంభకోణాలు, భూఅక్రమాలు, గట్‌మనీ వ్యవహారాలను బీజేపీ క్షేత్రస్థాయిలో ఎండగడుతూ మమత ఇమేజ్‌ను ప్రజల ముందు డ్యామేజ్ చేసింది భాజపా. ముఖ్యంగా బెంగాల్‌లో ఒక మహిళ ముఖ్యమంత్రిగా ఉండగా బెంగాల్ మహిళలకు కనీస రక్షణ లేకుండా పోయిందంటూ బీజేపీ గట్టి వాదన వినిపించింది. ఇదే సమయంలో కోల్‌కత ఆర్జీకర్ ఆస్పత్రిలో డాక్టర్ అత్యాచారం, హత్య దేశవ్యాపంగా తృణముల్ కాంగ్రెస్ పరువును పాతాళంలో పడేసింది. ఇక ఆర్‌ఎస్‌ఎస్ సహకారంతో ఎన్నికలకు ఏడాది ముందు నుంచే బీజేపీ పెద్దలు హిందుత్వ ఎజెండా, అభివృద్ధి కార్యక్రమాలు డబుల్ ఇంజిన్ సర్కారుతో కలిగే ప్రయోజనాలను బెంగాల్ ప్రజలకు వివరించి, వారి మనస్సులను గెలుచుకునే ప్రయత్నం చేశారు. ఇక తామొస్తే టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీస్తామని, బంగ్లాదేశ్ వలసదారులను తరిమికొడతామని, బెంగాల్ సరిహద్దుల్లో 45రోజుల్లోనే కంచె నిర్మాణం చేపడతామని మోడి ప్రజలకు పెద్దఎత్తున హామీలిచ్చారు. దీంతో పాటూ ఎన్నికల సమయంలో ఏకంగా పక్షం రోజులు బంగ్లా సరిహద్దులో అమిత్‌షా తిష్టవేసి అక్రమార్కులు బెంగాల్‌లో చొరపడకుండా అడ్డుకట్ట వేశారు. ఫలితంగా బెంగాల్ ఎన్నికల్లో కమలం తొలిసారిగా వికసించింది. 206 సీట్లతో తిరుగులేని మెజారిటీ సాధించింది. తద్వారా జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్ ప్రకాశ్ ముఖర్జీ స్వరాష్ట్రం బెంగాల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసి దేశంలో తనకు ఎదురుచెప్పే నేత లేరనే స్థాయికి మోదీ చేరుకున్నారు. ఇక బెంగాల్‌లో గెలుపు బావుటా ఎగరవేసిన అనంతరం 21 రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వాలు ఉన్న ఇండియా మ్యాప్‌ను మోడి విడుదల చేసి కమలం సత్తాను ప్రపంచానికి చాటారు.

ఏదేమైనా గతంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రతిపక్షమైన సమాజ్‌వాదీ పార్టీని మట్టికరిపించిన మోడీ 2026లో ఐదురాష్ట్రాల ఎన్నికల్లో బెంగాల్‌లో మమతా బెనర్జీని గద్దెదించి చరిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకున్నారు. కొసమెరుపేమిటంటే, గతంలో బెంగాల్‌లో మమతా బెనర్జీకి కుడిభుజంగా ఉన్న సువేంది అధికారినే ఆయుధంగా ప్రయోగించి భవానీపూర్‌లో మమతాబెనర్జీని ఎమ్మెల్యేగా సైతం ఓడించడం మోడి రాజకీయ చాణక్యతకి అసలు సిసలు నిదర్శమని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అందుకే ఇప్పుడు 'మోడీ అంటే ఓ సమ్మోహన శక్తి' అంటూ దేశం మొత్తం నినదిస్తోంది..!

# రవీంద్ర కవీంద్రుని జయంతి

విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం నెల్లూరు బాలభవన్ డైరెక్టర్, రచయిత్రి గోవిందరాజు సుభద్రాదేవి సారధ్యంలో చిన్నారులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. నగరంలోని చిల్డ్రన్స్‌పార్కు వద్దనున్న విశ్వసాయి స్కూల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో, తొలుత రవీంద్రుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె రవీంద్ర కవీంద్రుని రచనలు, సాహిత్యంలోని విశిష్టతలను చిన్నారులకు



చిన్నారులకి బహుమతులందజేస్తున్న గోవిందరాజు సుభద్రాదేవి

అర్ధమయ్యేలా వివరించారు. ఈ సందర్భంగా వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన షేక్ సనాని అభినందించారు. హెడ్మాస్టర్ వల్లి, ఉపాధ్యాయినులు ప్రియాంక, ప్రియ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

# విజయ్.. విజయ దుందుభి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా ఈ ఫలితాలపై ఆంధ్రా రాజకీయ వర్గాలలో విస్తృత చర్చ సాగుతోంది. మూడో ప్రత్యామ్నాయంగా వచ్చి తొలుత కింగ్ మేకర్ అని ఆ తర్వాత ఏకంగా కింగ్ అనేలా విజయ్ దూసుకెళ్తున్నారు. సినీరంగంలోనే కాదు రాజకీయాల్లోనూ దళపతే అని నిరూపించారు. అయితే ఆయనకు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం అంతా ఆషామాషీగా దక్కలేదు. రెండు జాతీయ పార్టీలను, రెండు అతిపెద్ద ప్రాంతీయ పార్టీలను విజయ్ ఎదుర్కొని నిలబడి చివరికి గెలువు తలుపును తట్టారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ఆయన సొంత నియోజకవర్గం కొళత్తూరులో ఓ సామాన్యుడిని నిలబెట్టి మరీ ఓడించారు. దశాబ్దాల చరిత్ర ఉన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళనిస్వామికి కనీసం ప్రతిపక్షహోదా కూడా లేకుండా చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీని సైతం చావుదెబ్బ కొట్టారు. వామపక్షాలు, చిన్నా చితకా పార్టీలకు సైతం ఉనికి లేకుండా చేశారు. దీనికి ప్రధాన కారణం ఆయన తనను, తన అభిమాన సంఘాలను మాత్రమే నమ్ముకోవడం. విజయ్ మక్కల్ ఇయక్కం పేరుతో కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు, జనరంజక కార్యక్రమాలు చేపట్టి విజయ్ ప్రజాభిమానం సంపాదించారు. ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలోనూ విరాళాలు, వస్తు సామగ్రిని అందించి ప్రజలకు చేరువయ్యారు. ప్రతిభా అవార్డుల పేరుతో పేద పిల్లలను ప్రోత్సహించి యువతలో క్రేజ్ సంపాదించారు. దీంతో డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు ఎంత ప్రయత్నించినా విజయ్‌పై ప్రజల్లో ఉండే అభిమానాన్ని వీసమెత్తయినా తగ్గించలేకపోయాయి. ఫలితంగానే ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా విజయ్ మొక్కవోని దీక్షతో ఒంటరిగానే ఎన్నికల బరిలో నిలిచి అతిపెద్ద పార్టీగా తమిళనాట విజయదుందుబి మోగించారు.

## విజయ్ విజయంపై తెలుగు రాష్ట్రాల్లో చర్చ..!

విజయ్ పార్టీ టీవీకే సాధించిన అసాధారణ విజయంపై ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చర్చ జోరందుకుంది. సినీ రంగం నుంచి రాజకీయ రంగానికి నటులు రావడం ఎప్పటి నుంచో జరుగుతున్నదే. అయితే అత్యంత అరుదుగా మాత్రమే కొందరు నటులు తమదైన ముద్ర వేస్తూ ముఖ్యమంత్రుల స్థాయికి ఎదిగారు. వారిలో ఎంజీఆర్, ఎన్టీఆర్ మాత్రమే ఇప్పటి వరకు సీఎంగా పనిచేశారు. తాజాగా విజయ్ ఆ కోవలోకి త్వరలో చేరనున్నారు. దాదాపు చావుతప్పి కన్ను లొట్టబోయినట్లుగా స్టాలిన్ కుమారుడు, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ బొటాబొటీ మెజారిటీతో గట్టెక్కారు. దీనికి ప్రధాన కారణం అధికారంలో ఉన్నప్పుడు ప్రజా ఆకాంక్షలను గుర్తించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం. అక్రమాలకు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారడం వంటి విషయాలు డీఎంకే ప్రభుత్వాన్ని కోలుకోలేని దెబ్బతీశాయి. తమిళనాడు పరిస్థితులను గమనించి ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటూ నిత్యం జాగురూకతతో వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న మాట ఆ పార్టీ వర్గాలనుండే వినపడడం గమనార్హం. లేకుంటే తమిళనాడులో అధికార పార్టీలకు పట్టిన గతే ఇక్కడా పునరావృతమైనా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఎందుకంటే ఇప్పటికే పలువురు కూటమి ఎమ్మెల్యేలపై అవినీతి ఆరోపణలు రావడం, లైంగిక వేధింపుల కేసులు నమోదవడం, భూకబ్జాలకు పాల్పడ్డారనే విమర్శలు హోరెత్తడం తెలిసిందే. వాటిని టీడీపీ, జనసేన అధినేతలు ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తే మంచిది, లేకుంటే భవిష్యత్‌లో ప్రజాగ్రహానికి గురయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇక తెలంగాణలోనూ విజయ్ పార్టీ విజయంపై అటు టీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆచితూచి స్పందిస్తున్నారు. విజయ్ ఫ్యాక్టర్ భవిష్యత్ రాజకీయ మార్పులకు ఓ హెచ్చరిక లాంటిదని అంటున్నారు.

## ఆదిలోనే హంసపాదు..!

తమిళనాడులో గత మూడురోజులుగా వ్యూహాత్మక రాజకీయాలు నడుస్తున్నాయి. రాజకీయాల్లో ఏదైనా సాధ్యమే అనే తరహాలో జంతర్‌మంతర్ డ్రామాలు తారాస్థాయికి చేరాయి. వివరాలలోకి వెళితే... అనూహ్యంగా 108 సీట్లు సాధించి తమిళనాట పొలిటికల్ హీరోగా నిలిచిన విజయ్ ఇప్పుడు రాజకీయ చట్రంలో ఇరుక్కున్నాడు. రాజకీయ అపరిపక్వతతో ఆయన తీసుకున్న చిన్న నిర్ణయం అతిపెద్ద తప్పుగా మారి ఆయన ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కకుండా అడ్డుకుంటోంది. ప్రభుత్వం ఏర్పాటు చేయడం కోసం ఆయన బీజేపీకి బద్ధశత్రువైన కాంగ్రెస్ మద్దతు కోరడమే విజయ్ వేసిన అతి పెద్ద రాజకీయ తప్పటడుగు. ఆయన ఎవరి మద్దతు కోరకుండా బలనిరూపణ కోసం ప్రయత్నించి వుండినా, బీజేపీ ఆదేశాలతో ఏఐఏడీఎంకే పరోక్షంగా ఆయనకి సపోర్ట్ చేసివుండే అవకాశాలు వుండేవి. కాంగ్రెసుతో జత కట్టడంపై ఆగ్రహించిన భాజపా విజయ్ సీఎం కుర్చీని ఎక్కకుండా గవర్నర్ ద్వారా అడ్డుకుంటోందన్నది విశ్లేషకుల అభిప్రాయం. రాజకీయాలు వేరు సినిమాలు వేరు. ఆ వ్యత్యాసం విజయ్‌కి ఇప్పుడు ప్రారంభంలోనే అర్ధమైపోయింది. అయితే ఇప్పుడు విజయ్‌ని అధికారంలోకి రాకుండా అడ్డుకుంటే ఆయనకి ఓటు వేసిన తమిళ తంబీలు తిరుగుబాటు చేసే అవకాశాలు కూడా లేకపోలేదు. పరిస్థితులు తారుమారై విజయ్ ముఖ్యమంత్రి కాకపోతే తమిళనాడులో మళ్ళీ ఎప్పుడు ఎన్నికలు జరిగినా విజయ్ పార్టీ 200కి పైగా సీట్లు సాధించేంత సానుభూతి, సానుకూలత కూడా ఆయనకి లభిస్తాయని విశ్లేషకులు పేర్కొనడం విశేషం.

## ఆచితూచి అడుగేస్తున్న ద్రవిడ పార్టీలు..!

డిఎంకె, ఏఐఏడిఎంకె పార్టీలు రెండూ ఏకమై అధికారాన్ని పంచుకుంటాయనే పుకార్లు కూడా సామాజిక మాధ్యమాలతో పాటు ప్రధాన మీడియాలలో షికారు చేస్తున్నాయి. ఇదే తరుణంలో విజయ్‌కే ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించడంలో తాము ఎటువంటి అడ్డంకులు సృష్టించబోమని, అలాగే కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలు అవకాశం కల్పిస్తామని, ఆ తర్వాత ఇచ్చిన హామీల అమలు కోసం పట్టుబడతామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఇదే సందర్భంలో అన్నాడిఎంకెతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ఆలోచన తమకు లేదని, వెంటనే ఎన్నికలు రావాలని కూడా తాము ఆశించడం లేదని ఆయన పేర్కొన్నారు. యడపాడి పళనిస్వామి నాయకత్వంలోని ఏఐఏడిఎంకె మాత్రం గోడమీద పిల్లిలా పరిస్థితులను గమనిస్తూ.. ఎటు అవసరమైతే అటు దూకడానికి సిద్ధంగా ఉంది..!

# ఏసీల తయారీలో మేటి.. శ్రీసిటీ

ఏసీల తయారీలో మేటిగా శ్రీసిటీ అవతరిస్తోంది. ప్రపంచస్థాయి పారిశ్రామికవాడగా పేరెన్నికగన్న శ్రీసిటీలో ఇక ఏసీల ఉత్పత్తి గణనీయంగా పెరగబోతోంది. ఇప్పటికే ప్రపంచంలోని 31 దేశాలకి చెందిన వందలాది ప్రతిష్టాత్మకమైన పరిశ్రమలకి కేంద్రంగా శ్రీసిటీ తన విఖ్యాతిని ప్రపంచానికి చాటుతోంది. ఇప్పుడు తాజాగా శ్రీసిటీ సిగలో మరో ఆణిముత్యంలా 'క్యారియర్' ఏసీల కర్మాగారం మెరవబోతోంది. ప్రపంచ ప్రఖ్యాత ఏసీల కంపెనీ 'క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ 'క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ అండ్ రెఫ్రిజిరేషన్ లిమిటెడ' రూ.1,000 కోట్ల పెట్టుబడితో భారీ పరిశ్రమ నిర్మాణానికి బుధవారం శ్రీసిటీలో శ్రీకారం చుట్టడంతో ఏసీల తయారీ రంగంలో ఇది ఒక పెద్ద మలుపుగా పారిశ్రామిక వర్గాలు అభివర్ణిస్తున్నాయి. ఇది దక్షిణ భారతదేశంలో క్యారియర్‌కు తొలి తయారీ యూనిట్ కావడం విశేషం. దీంతో, 2028 నాటికి 80 శాతం ఏసీలు ఆంధ్రప్రదేశ్ నుంచే తయారు కానున్నాయి. రాష్ట్ర పారిశ్రామిక రంగానికి సంబంధించిన ఈ చారిత్రాత్మక ఘట్టంలో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్స్, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిధిగా పాల్గొని, ఈ కంపెనీ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం విశేషం.

### త్వరలో యువత కోసం మైక్రోనెట్

ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే "కూల్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా"గా గుర్తింపు పొందింది. 9 ప్రముఖ ఏసీ తయారీ సంస్థలు, 30 సరఫరా సంస్థలు ఇక్కడ ఉన్నాయి. 2027 నాటికి భారతదేశానికి అవసరమైన 60% ఏసీలు, 2028 నాటికి 80% ఇక్కడే తయారు అవుతాయని ఆశిస్తున్నాం' అని కూడా ఆయన చెప్పారు.

క్యారియర్ ప్రస్థానంలో ఇదొక మైలురాయి అని క్యారియర్ కంపెనీ గ్లోబల్ చైర్మన్ మరియు సీఈఓ డేవిడ్ ఎల్ గిట్లిన్ అభివర్ణించారు. ఈ ప్రాజెక్ట్ క్యారియర్ భారత ప్రయాణంలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. 100 మిలియన్ డాలర్ల పెట్టుబడి ద్వారా ఆవిష్కరణలు, సుస్థిరత, స్థానిక ప్రతిభాభివృద్ధికి తమ కట్టుబాటును చాటుతున్నాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, క్యారియర్ గ్లోబల్ యాజమాన్య ప్రతినిధులు డేవిడ్ ఎల్ గిట్లిన్, మైఖేల్ ఎల్ గియర్జెస్, సుందరేశన్ నారాయణన్, శ్రీసిటీ చైర్మెన్ శ్రీనిరాజు, శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీసిటీ.. ఓ గ్లోబల్ తయారీ కేంద్రం

### ప్రశంసించిన మంత్రి లోకేష్

"శ్రీసిటీ కేవలం ఒక పారిశ్రామిక పార్క్ కాదు, గ్లోబల్ తయారీ కేంద్రం. 8,500 ఎకరాల విస్తీర్ణంలో 31 దేశాలకు చెందిన 250 కంపెనీలు ఉన్నాయి. 6 బిలియన్ ఎగుమతులు, 70,000 ఉద్యోగాలు, అందులో 50శాతం మహిళలకు చెందడం విశేషం అంటూ మంత్రి లోకేష్ ఈ సందర్భంగా కొనియాడారు. ఆటోమోటివ్ నుండి ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ నుండి ఇంజనీరింగ్ వరకు వేదిక అయిన శ్రీసిటీ 'మేక్ ఇన్ ఇండియా' మరియు 'మేడ్ ఇన్ ఆంధ్రప్రదేశ'కు ఒక ప్రతీక అన్నారు. ఉద్యోగుల్లో మహిళల భాగస్వామ్యం దాదాపు 50 శాతంగా వున్న శ్రీసిటీ "స్త్రీ సిటీ"గా కూడా గుర్తింపు పొందుతోంది అని ప్రశంసించారు. అంతేకాదు, నా మొదటి ఎయిర్ కండిషనర్ కూడా క్యారియరే. కాబట్టి ఇది కేవలం వ్యాపార సంబంధం కాదు, ప్రత్యేకమైన అనుబంధం. మోడ్రన్ ఎయిర్ కండిషనింగ్‌ను కనిపెట్టడం నుండి 50 బిలియన్ గ్లోబల్ సంస్థగా ఎదగడం వరకు క్యారియర్ ఎప్పుడూ ఆవిష్కరణలో ముందంజలో ఉంది. ఇప్పుడు ఆ ఆవిష్కరణలు మన రాష్ట్రానికి రావడం, దీని ద్వారా 1000 కోట్ల పెట్టుబడి సుమారు 3,000 స్థానిక ఉద్యోగాలను సృష్టిస్తుండడం హర్షదాయకమని లోకేష్ అన్నారు. 'ఇది మన రాష్ట్రం, మన ఎకోసిస్టమ్, మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి నాయకత్వంపై నమ్మకానికి నిదర్శనం అని ఆయన ప్రశంసించారు. భారతదేశంలోని అత్యంత చురుకైన పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లలో ఒకటైన శ్రీసిటీలో జరిగిన ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో గౌరవంగా ఉందన్నారు. ఈ సందర్భంగా క్యారియర్ సంస్థ నాయకత్వానికి ఆయన శుభాకాంక్షలు చెప్పారు.

## శ్రీసిటీకి గర్వకారణం - ఎం.డీ డా. రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, క్యారియర్ తమ కంపెనీ ఏర్పాటుకు శ్రీసిటీని ఎంపిక చేసుకోవడం గర్వకారణమని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ భారతదేశ అభివృద్ధి దిశగా క్యారియర్ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని, స్థానిక నైపుణ్యాభివృద్ధి మరియు సుస్థిర పారిశ్రామిక వృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ యూనిట్‌లో అధునాతన చిల్లర్లు తయారు చేయనున్నారని, 5 సముద్ర తీర నౌకాశ్రయాలకు సమీపంలో ఉండటం వల్ల ఎగుమతులకు అనుకూలంగా మారనుందని తెలిపారు. వచ్చే ఏడాది చివరి నాటికి కార్యకలాపాలు ప్రారంభించే ఈ ప్లాంట్ ద్వారా సుమారు 3,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు వస్తాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అలాగే గ్రీన్ మాన్యుఫాక్చరింగ్ విధానాలతో శక్తి సామర్థ్యం గల 'కూలింగ్ సొల్యూషన్ల' తయారీకి కూడా ఇది కేంద్రంగా మారనుందని తెలిపారు.


## ఉత్తరక్రియలు

ఆప్యాయత, అనురాగాలు పంచిన అమృతమూర్తి
మా ఇంటి దీపం
**శ్రీమతి పులిమి లీలావతి గారు**
తేది. 30.4.2026 గురువారం స్వర్గస్తురాలైనారు.
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కుమారుడు - కోడలు
**డా॥ పులిమి రమేష్‌రెడ్డి - శ్రీమతి విజయలక్ష్మి**
కుమార్తె - అల్లుడు
**శ్రీమతి కె.ప్రతిభ - డా॥ కె.యస్.ప్రసన్నకుమార్‌రెడ్డి**
చెల్లెలు - మరిది
**డా॥ డి.ప్రమీల - డా॥ సిహెచ్. స్వామినాథన్‌రెడ్డి**
మరియు **మనుమలు, మనుమరాళ్ళు**



**శ్రీమతి పులిమి లీలావతి గారు**
శ్రీ పులిమి వెంకట సుబ్బారెడ్డి (చిన్న బుజ్జిరెడ్డి) గారి ధర్మపత్ని
జననం : 12.11.1930 మరణం : 30.04.2026

**ఉత్తరక్రియలు**
వారి **పెద్దకర్మ: తేది. 14.5.2026 గురువారం**
ఉదయం 11.30 గం.లకు నెల్లూరు,
శ్రీనివాస అగ్రహారంలోని మా స్వగృహము నందు జరుగును.
బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com